




# కందనవోలు అందాలు



చూపులకందని అందాలు
మదిలో వేసెను బంధాలు
భావం నిండిన భంగిమలు
రాగాలై పలికెను సరిగమలు
పచ్చని పంటల కళకళలు
విరిసే నవ్వుల కిలకిలలు
ఆకాశాన మేఘ మాలికలు
అద్భుత అందాల కర్నూలు

చూసే హృదయానికి కళ్లుండాలే కానీ ప్రతి విరుపూ ఓ మధురమైన చిత్తరువే. నగరంలో వాహనాల కాలుష్యం లేదనేలా నీలి ఆకాశం కాన్వాస్‌గా చేసుకుని వెండి మబ్బుల వన్నెలద్దుకుంది. నివాస ప్రాంతాల వెనుక పచ్చని కొండలపై నురుగ ముద్దలుగా ఏర్పడి చూపరులకు ఆనందాన్నిచ్చాయి. పుడమిని అల్లుకున్న పచ్చదనం.. మధ్యమధ్యలో నగర కాలనీల అందాలు.. వడ్డానం రహదారులు. నీలాకాశంలో విరిసిన తెల్లని మేఘాలు నగరాన్ని ముద్దాడేందుకు కనిపించాయి. కర్నూలు నగరం సమీపంలోని జగన్నాథగట్టుపై ప్రకృతి రమణీయత పర్యాటకులను కట్టిపడేస్తోంది. వెండిమబ్బుల్లా కనిపిస్తున్న ఈ అందమైన దృశ్యాలను చూసి ప్రకృతి ప్రేమికులు మైమరచిపోతున్నారు.

- కర్నూలు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి)



# సౌకర్యాలు లేని మార్కెట్ యార్డు

**వర్షం వస్తే పంట ఉత్పత్తులు తడవాల్సిందే**

- ముందుకు రాని కాంట్రాక్టర్లు
- తీవ్రంగా నష్టపోతున్న రైతులు
- ఆదాయం ఘనం.. సేవలు శూన్యం
- కూటమి ప్రభుత్వంపైనే అన్నదాతల ఆశలు

**ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) :** ఐదేళ్ల వైసీపీ పాలన మార్కెట్ కమిటీల అభివృద్ధిని విస్మరించింది. వ్యయ ప్రయాసలకు ఓర్చి పండించిన పంట ఉత్పత్తులను మార్కెట్ కమిటీలకు విక్రయానికి తీసుకొస్తే అక్కడ రైతులకు కనీస సౌకర్యాలు కూడా లేవు. ముఖ్యంగా ఆదోనిలో వర్షం వస్తే మార్కెట్ యార్డులో ప్లాట్ ఫాంపైకి అడుగులోతు నీరు చేరి పంట ఉత్పత్తులన్నీ కొట్టుకుపోతున్నాయి. వాన వస్తే రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మార్కెట్ కమిటీలకు రూ. కోట్ల ఆదాయమున్నా రైతులకు కల్పించాల్సిన సేవలు మాత్రం శూన్యం. గతంలో చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు ముందు రాక పనులు నిలిచిపోయాయి. దీంతో రైతులకు అవస్థలు తప్పడం లేదు. అధికారంలోకి వచ్చిన కూటమి మార్కెట్ కమిటీల అభివృద్ధిపై దృష్టి పెట్టింది.

### ఆదోని మార్కెట్ యార్డుకు ప్రత్యేకమైన గుర్తింపు

రాష్ట్రంలోనే ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డుకు ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. పంట ఉత్పతుల ద్వారా ఏటా రూ.1600 కోట్ల లావాదేవీలతోపాటు పరోక్షంగా మరో రూ.400 కోట్ల లావాదేవీలు జరుగుతున్నాయి. పంట ఉత్పత్తుల క్రయవిక్రయాల ద్వారా మార్కెట్ కమిటీకి ఏటా రూ.16 కోట్లు సెస్సు రూపంలో ఆదాయం సమకూరుతోంది. ఇంత ఆదాయం ఉన్నా రైతులకు మాత్రం సౌకర్యాలు కల్పించడంలో మార్కెటింగ్ శాఖ విఫలమవుతోంది. వర్షం వస్తే మార్కెట్ కమిటీకి విక్రయించడానికి తెచ్చిన పంట ఉత్పత్తులన్నీ తడిసిపోతున్నాయి. డ్రైనేజీలు సరిగా లేక వర్షం నీరంతా ప్లాట్‌ఫాంపై చేరి పంట ఉత్పత్తులన్నీ ఆ వర్షపు మడుగు నీటిలో కొట్టుకుపోతున్నాయి. ఇటీవల రైతులు తెచ్చిన వేరుశనగ వాళ్ల కళ్ల ముందే వర్షపు నీటిలో కొట్టుకుపోతుంటే రైతులు గుండెలు బాదుకున్నారు. తలకు చుట్టుకున్న తవాలు, నడుముకు కట్టుకున్న పంచెను తీసి ఒడిసి పట్టుకునే ప్రయత్నం చేశారు. అయినా ఫలితం లేకపోవడంతో రూ.లక్షల్లో తీవ్రంగా నష్టపోయారు. మార్కెటింగ్ శాఖ కమిషనర్ విజయ ఆదోని మార్కెట్ యార్డులో పర్యటించి డ్రైనేజీలు ప్లాట్ ఫాంలా ఎత్తు పెంపు షెడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అదే గత వైసీపీ పాలనలో మార్కెట్ యార్డులో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టరులు ముందుకు రావడం లేదు. ఆ బిల్లులను కూడా చెల్లిస్తామని పనులు చేపట్టాలని అధికారులు హామీ ఇస్తున్నారు.



ప్లాట్‌ఫాంపై చేరిన నీరు (ఫైల్)



మార్కెట్ యార్డులో వర్షపు నీటిలో తేలుతున్న వేరుశనగ కాయలు (ఫైల్)

### అసంతృప్తిగా జంబో షెడ్

మార్కెట్ యార్డులో 2018-17లో అప్పటి టీడీపీ ప్రభుత్వం టీఎంసీ యార్డులో రూ.5 కోట్లతో పత్తి దిగుబడులు తడవకుండా జంబో కవర్డ్ షెడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించింది. కాంట్రాక్టర్ పనులు ప్రారంభించి పిల్లర్లు వేశారు. ప్రభుత్వం మారడంతో పైకప్పు పనులు మిగిలిపోయాయి. చేసిన పనులకు అధికారంలోకి వచ్చిన వైసీపీ బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ చేతులెత్తేశారు. కవర్డ్ పైకప్పు వేయాలని కాంట్రాక్టరులు పలుమారులు కోరినా బిల్లు మంజూరు కాకపోవడంతో ముందుకు రాలేకపోయారు. మూడు సార్లు టెండర్లు పిలిచినా ఒక్కరు కూడా ముందుకు రాలేదు. కూటమి అధికారంలోకి రావడంతో మరోమారు టెండర్లు పిలిచి పనులు చకచకా చేయించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని అధికారులు పేర్కొంటున్నారు.



దిగుబడుల కింద చేరిన వర్షపు నీరు

### శిథిలావస్థలో దుకాణాలు

350పైగా దుకాణాలు ఉన్నాయి. ఇందులో వందకుపైగా దుకాణాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. పైకప్పులన్నీ పెచ్చులు ఊడడంతో వర్షపు నీటికి గోడలన్నీ నెమ్ము చేరి బీటలు వారుతున్నాయని కమీషన్ ఏజెంట్లు వాపోతున్నారు. దుకాణాల ముందు ఉన్న రేకుల షెడ్డు నుంచి వరండాలో వర్షపు నీరు కిందికి వెళ్లేందుకు సరైన డ్రైనేజీలు లేకపోవడంతో పాట్‌ఫాంపైకి చేరుతోంది. పంట ఉత్పత్తులన్నీ తడిసిపోతున్నాయని, కూటమి ప్రభుత్వమైనా రైతులకు సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

### బడ్జెట్ కేటాయించిన వెంటనే 15 రోజుల్లో టెండర్లు



డ్రైనేజీల నిర్మాణానికి పాత యార్డులో దుకాణాల ముందు వరండాలలోకి నీరు చేరకుండా పనులు చేపడతాం. రూ.70 లక్షలు డ్రైనేజీలకు, మరో 26 లక్షలు గట్టర్ల నిర్మాణానికి మార్కెటింగ్ శాఖ కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపాం. ఆమోదం తెలిపిన వెంటనే 15 రోజుల్లో టెండరులు పిలిచి పనులు చేపడతాం. కవర్డ్ షెడ్ పైకప్పు వేయడానికి కూడా టెండరులు పిలిచి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తాం.

-సుబ్బారెడ్డి డీఈ, మార్కెటింగ్ శాఖ ఆదోని

## న్యూస్ బాక్స్

### ముగిసిన టెట్

**చివరి రోజు 284 మంది అభ్యర్థులు గైర్హాజరు**



హాల్ టికెట్ నంబర్లను చూసుకుంటున్న అభ్యర్థులు

**కర్నూలు, ఎడ్యుకేషన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):** ఉపాధ్యాయ అర్హత(టెట్) పరీక్ష సోమవారం ముగిసింది. ఈ నెల 3న టెట్ మొదలైంది. జిల్లా వ్యాప్తంగా 54,083 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. కర్నూలు, హైదరాబాద్‌లో మొత్తం ఎనిమిది పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. కర్నూలులో నాలుగు, ఆదోని, ఎమ్మిగనూరులో ఒక్కొక్కటి చొప్పున ఏర్పాటు చేశారు. అలాగే, హైదరాబాద్‌లో రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. కర్నూలు జిల్లాలో 40,660 మంది, హైదరాబాద్‌లో 13,423 మంది అభ్యర్థులను కేటాయించారు. ఈ పరీక్షలు ఉదయం 9.30 నుంచి, మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి, సాయంత్ర 5 గంటల వరకు రెండు సెషన్స్‌లో ఆన్‌లైన్ పరీక్షలు కొనసాగాయి. జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ ఆధ్వర్యంలో డిపార్ట్‌మెంట్ ఆఫీసర్స్‌తోపాటు స్క్వాడ్ బృందాలు పరీక్షా కేంద్రాలను పర్యవేక్షించాయి. చివరిరోజు జరిగిన పరీక్షకు మొత్తం 1,898 మంది అభ్యర్థులకు గాను 1,614 మంది హాజరయ్యారు. 284 మంది గైర్హాజరయ్యారు. ఉదయం జరిగిన పరీక్షకు 1,504 మందికిగాను 1,323 మంది హాజరుకాగా, 181 మంది గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 394 మందికి గాను 291మంది హాజరుకాగా, 103 మంది గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను డీఈవో శామ్యూల్, అధికారులు పర్యవేక్షించారు.

### డీపీవోలో డిప్యుటేషన్లు రద్దు

**కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):** జిల్లా పంచాయతీ కార్యాలయంలో డిప్యుటేషన్లను డీపీవో భాస్కర్ రద్దు చేశారు. దీంతో జూనియర్ అసిస్టెంట్లుగా కొనసాగుతున్న శివ, తిమ్మప్ప, రామ్‌నాథ్ ఆదోని డీఎల్పీవో కార్యాలయంలో రిపోర్టు చేశారు. వీరి స్థానంలో రెగ్యులర్ జూనియర్ అసిస్టెంట్లుగా చంద్రకాంత్, ఉమా మహేశ్వరరావు, సాయితేజ నియమితులయ్యారు. వీరు మంగళవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

### ప్రజల సమస్యలను పరిష్కరించాలి: కలెక్టర్



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

**కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):** ప్రజల సమస్యలను రీఓపెన్ కాకుండా పరిష్కరించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, డీఆర్వో చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

### శ్రీశైలానికి భారీగా ఇన్‌ఫ్లో

**శ్రీశైలం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి):** శ్రీశైలం జలాశయానికి ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి వరద భారీగా కొనసాగుతోంది. దాంతో సోమవారం డ్యాం అధి కారులు ఐదు క్రస్టుగేట్లు పది అడుగుల మేర ఎత్తి దిగువ నాగార్జున సాగర్ జలాశయానికి నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల నుంచి 1,17,539 క్యూసెక్కులు, సుంకేశుల నుంచి 51,324 క్యూసెక్కు లు మొత్తం 1,68,863 వరద నీరు వస్తోంది. సోమవారం సాయంత్రం 6 గంటల సమాయానికి జలాశయానికి 1,64,963 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. శ్రీశైలం జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత పూర్తి స్థాయి నీటిమట్టం 884.30 అడుగులకు చేరుకుంది. జలాశయం ఐదు క్రస్టుగేట్ల ద్వారా 1,38,770 క్యూసెక్కుల నీటిని దిగువ నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు.

# అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

- జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్డి
- పోలీసు అమరవీరుల స్థూపానికి నివాళి

**కర్నూలు క్రైం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి):** విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమరవీరులను స్మరించుకోవడం అందరి బాధ్యత అని, వారు చేసిన త్యాగాలు, సేవలు మరువలేనివని జిల్లా ప్రధాన న్యాయాధి కారి జి.కబర్డి అన్నారు. సోమవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలోని పరేడ్ మైదానంలో అమరవీరుల స్థూపం వద్ద స్మృతి పరేడ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన న్యాయాధికారితోపాటు కలెక్టర్ పి.రంజిత్ బాషా, ఎస్పీ బిందు మాధవ్, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, హాజరై పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం అమరవీరుల స్థూపానికి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్డి మాట్లాడుతూ మనకు రక్షణ కల్పిస్తూ ప్రాణాలు కోల్పోయిన పోలీసు అధికారుల ధైర్యసాహసాలు, దేశభక్తి, విధేయతలను గుర్తుంచుకుని గౌరవించాలన్నారు. దేశభద్రత కోసం రాత్రి, పగలు తేడా లేకుండా విధి నిర్వహణలో ప్రాణాలను పణంగా పెట్టి ప్రజల ప్రాణాలను కాపాడుతున్నారని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ పోలీసు వ్యవస్థలో 24 గంటలు పని చేయాల్సి ఉంటుందన్నారు. రోడ్డు ప్రమాదాలు, ఫైర్, ఏదైనా ప్రాణనష్టం జరిగినప్పుడు వెంటనే స్పందించేది పోలీసులేనని తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ అమర వీరులను ఆదర్శంగా తీసుకొని పోలీసు అమరవీరుల కుటుంబాలకు అండగా ఉంటున్నామన్నారు. జిల్లా ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. అనంతరం అమరవీరుల కుటుంబాల సభ్యులను కలెక్టర్, న్యాయాధికారి, ఎస్పీ శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో హోంగార్డు కమాండెంట్ సదరన్ రిజియన్ ఎం.మహేష్ కుమార్, ఏఆర్ అడిషినల్ ఎస్పీ కృష్ణమోహన్, డీఎస్పీలు బాబుప్రసాద్, శ్రీనివాసాచారి, శ్రీనివాసరావు, పోలీసు వెల్ఫేర్ డాక్టర్ స్రవంతి, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు నాగరాజు పాల్గొన్నారు.



పోలీసు అమరవీరుల స్థూపానికి నివాళి అర్పిస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి కబర్డి, కలెక్టర్, ఎస్పీ



# ఉగాదికొస్తాం..!

- వలసెళ్లిపోతున్న పల్లె ప్రజలు
- పనుల కోసం పరుగులు

కర్నూలు పశ్చిమ ప్రాంతం వలసలకు పెట్టింది పేరు. సమీపంలో తుంగభద్ర నది బిరబిరా ప్రవహిస్తున్నా పాలకుల నిర్లక్ష్యంతో తాగు, సాగునీటి అవసరాలకు నిత్యం ఇబ్బందులు తప్పట్లేదు. పరిశ్రమలు ఏమాత్రం ఇక్కడ లేవు. దీంతో లక్షలాది మంది ప్రజలు బతుకుదెరువు కోసం పట్టణాల బాట పడుతున్నారు. వేల సంఖ్యలో కుటుంబాలు సుగ్గీ వెళ్తున్నాయి. ఫలితంగా పల్లెలు బోసిపోతున్నాయి.

వివరాలు 6లో...



# మద్యం దుకాణం క్లోజ్!



మూతపడ్డ వైన్‌షాప్

**కల్లూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) :** కల్లూరు మండలం లక్ష్మీపురంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలకు వంద మీటర్ల దూరంలో కొత్తగా వైన్‌షాప్ ఏర్పాటు చేశారు. ఆదివారం ఎవరూ లేని సమయంలో నిర్వాహకులు వైన్‌షాప్‌ను హడావిడిగా ఓపెనింగ్ చేసి అమ్మకాలు సాగించారు. పాఠశాలకు అత్యంత సమీపంలో వైన్‌షాప్ ఏర్పాటు సరికాదని గ్రామస్థులు, పాఠశాల ఉపాధ్యాయులు సూచించినా పెడచెవిన పెట్టారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. సోమవారం లక్ష్మీపురం గ్రామ ప్రజలు, ఉపాధ్యాయులు కల్లూరు ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదికలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితకు ఈ విషయాన్ని వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే పాఠశాల సమీపంలో వైన్‌షాప్ తొలగించాలని నిర్వాహకులను ఆదేశించారు. దీంతో సోమవారం మధ్యాహ్నం నుంచి వైన్‌షాప్‌ను మూసేశారు.

# భవనం ఎక్కిన చెట్లు



రుద్రవరంలోని పాత ఆరోగ్యకేంద్రం భవనంపై చెట్లు ఇలా

రుద్రవరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరం పాత ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం గోడలపై మొక్కలు మొలిచి వృక్షాలుగా మారాయి. భవనం చుట్టూ గోడలపై, కిటికీలపై చెట్లు పెద్దపెద్ద వృక్షాలుగా మారాయి. జువ్వి చెట్ల పండ్లను పక్షులు తిని రెట్ట వేస్తుండడంతో భవనం గోడలపై మొలిచాయి.

# నేలవాలిన వరి

బండిఆత్మకూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): గాలితో కూడిన వానకు పలు గ్రామాల్లో వరి పంట నేల వాలింది. సోమవారం మధ్యాహ్నం మండలంలోని వెంగళరెడ్డిపేట, కడమలకాల్వ, ఈర్నపాడు, ఎ. కోడూరు, పార్నపల్లె గ్రామాల్లో గాలి వాన బీభత్సం సృష్టించింది. దీంతో వెన్ను విరిసిన వరి నేల కూలింది. దాంతో రైతన్నలు లబోదిబోమంటున్నారు. దిగుబడి తగ్గిపోతుందని, తద్వారా నష్టాలు రావటం ఖాయమని రైతులు వాపోతున్నారు.



వెంగళరెడ్డిపేటలో నేలకూలిన వరి పంట



# మల్లన్న సన్నిధిలో దిల్‌రాజు

శ్రీశైలం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మల్లికార్జున స్వామి, భ్రమరాంబ అమ్మవార్లను సోమవారం సినీ నిర్మాత దిల్‌రాజు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. నిర్మాత దిల్‌రాజు స్వామివారికి అభిషేకం నిర్వహించుకుని అనంతరం అమ్మవారికి ప్రత్యేక అర్చనలు జరిపించుకున్నారు. దర్శనానంతరం నిర్మాత దిల్‌రాజుతో అభిమానులు ఫొటోలు తీసుకున్నారు.




ఆలయ ప్రాంగణంలో దిల్‌రాజు

# అక్కడ ఆది మానవుని జాడలు



- నాటి చరిత్రను చాటుతున్న కేతవరం గుహలు
- అప్పటి నాగరికతకు దర్పణంగా కుడ్య చిత్రాలు
- ఇప్పటికీ కొండల్లో దర్శనమిస్తున్న నాటి చిత్రకళా వైభవం

ఓర్వకల్లు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): దాదాపు లక్ష సంవత్సరాలకు పూర్వమే అక్కడ ఆది మానవుని జాడలు ఉన్నాయి. నాగరికతకు దర్పణంగా కుడ్య చిత్రాలు దర్శనమిస్తున్నాయి. చరిత్రలో తనకంటూ ప్రత్యేక స్థానం ఏర్పాటు చేసుకున్న ఆ గుహలు ఇప్పటికీ పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. ఓర్వకల్లు మండలంలోని కేతవరం గ్రామంలోని గుహలు చరిత్రకు ఆనవాళ్లుగా నిలిస్తున్నాయి. ఇక్కడ ఉన్న కుడ్య చిత్రాలు ఆనాటి లిపితోపాటు వారి భాషను తెలుసుకునేందుకు ఉపయోగపడుతున్నాయి. పరిసరాల్లో ఆనాటి మానవుడు ఉపయోగించే వస్తువులు కూడా అక్కడక్కడా దర్శనమిస్తున్నాయి. ఇక్కడ కనిపించే శాసనాలు ద్రవిడుల ఆలోచనా విధానాన్ని తెలియజేసే రీతిలో ఉన్నాయి. ఆ పరిసర ప్రాంతాల్లో పర్యాటకులను ఆకర్షించేందుకు గెస్టు హౌస్, పిల్లలకు ఆట వస్తువులు ఏర్పాటు చేశారు. అయితే.. గెస్టు హౌస్ తలుపులు, కిటికీలు తదితర వస్తువులను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు.. పర్యాటకులను ఆకర్షించేలా కేతవరం గ్రామం నుంచి అటవీ ప్రాంతానికి రోడ్డు వేస్తే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.. ఇప్పటికైనా రాష్ట్ర పర్యాటక శాఖ, పురావస్తు శాఖ అధికారులు ఆ ప్రాంతంపై దృష్టి సారించి పర్యాటక కేంద్రంగా మార్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



కంప చెట్ల మధ్య వసతి గృహం




### ప్రాచీన రాళ్లపై లిపి చిత్రాలను సంరక్షించండి

మేము పిల్లలుగా ఉన్న సమయంలో ఆనాటి కలెక్టర్ కాశీ పాండే ఆదిమానవులు రాసిన లిపి, వివిధ బొమ్మలను గుర్తించారు. ఆ తర్వాత ఎందరో అధికారులు వస్తున్నారు.. వెళ్తున్నారు. నామమాత్రంగా రాతి బెంచీలు ఏర్పాటు చేసి వదిలేశారు. ఎంతో ఘన చరిత్ర కలిగిన ఈ ప్రాంతాన్ని పాలకులు, అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ఆదిమానవులు రాతలను ఆకతాయిలు చెరిపేస్తున్నారు. ప్రాచీన చరిత్ర కలిగిన ఈ ప్రాంతాన్ని సంరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. - బలరాముడు, కేతవరం



### చరిత్ర ఆనవాళ్లు చెదిరిపోతున్నాయి

ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి. అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేసి సంరక్షించాలి. అధికారులు తక్షణ చర్యలు తీసుకుని చరిత్ర ఆనవాళ్లను చెదిరిపోకుండా కాపాడాలి. మద్దిలేటి, కేతవరం



రాళ్లపై ఉన్న ప్రాచీన భాష

# 24న జాతీయ స్థాయి క్విజ్ పోటీలు

కర్నూలు కల్చరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి క్విజ్ పోటీలను ఈనెల 24న అంతర్జాలం జూమ్ యాప్ ద్వారా నిర్వహించనున్నట్లు లయన్స్ క్లబ్ ప్రతినిధి డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యూ ఢిల్లీలోని నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్‌ల సంయుక్త ఆధ్వర్యంలో యునైటెడ్ నేషన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విజేతలకు సర్టిఫికెట్లతోపాటూ నగదు బహుమతులు ఉంటాయని, ఆసక్తిగల 14 నుంచి 20 ఏళ్లలోపు విద్యార్థులు, యువకులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. వివరాలకు నగరంలోని వెంకటరమణ కాలనీలో మొదటి లైన్‌లోగల నైస్ కంప్యూటర్స్ శిక్షణ సంస్థ కార్యాలయంలో ఈనెల 22న సాయంత్రం 5 గంటల లోపు సంప్రదించవచ్చని తెలిపారు. ఎన్‌వైసీఈ డాట్ రాయపాటి ఎట్ జీమెయిల్ డాట్ కామ్‌లో జీమెయిల్ ద్వారా కూడా తమ పేర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

# జిల్లా స్కూల్ గేమ్స్ కోసం...

కర్నూలు స్పోర్ట్స్ అక్టోబరు 21, (ఆంధ్రజ్యోతి): జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో డీఎస్ఏ అవుట్‌డోర్ స్టేడియంలో ఈ నెల 24న అండర్-17 బాలబాలికలకు యోగా, చెస్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్జీఎఫ్ కార్యదర్శి గిడ్డయ్య తెలిపారు. నంద్యాల, కర్నూలు క్రీడాకారులు ఎంపికకు హాజరు కావాలని కోరారు.

- 24న కబడ్డీ ఎంపిక: ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 24న కబడ్డీ, షటిల్, బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు నంద్యాల నూనెపల్లి మున్సిపల్ హై స్కూల్‌లో షటిల్, నంది అకాడమిలో నంద్యాలలో నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లాల కార్యదర్శులు గిడ్డయ్య, శ్రీనాథ్ తెలిపారు. ఎంపికను ఉమ్మడి జిల్లాల క్రీడాకారులు హాజరు కావచ్చని తెలిపారు.
- ఉమ్మడి జిల్లా ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం డీఎస్ఏ అవుట్‌డోర్ స్టేడియంలో అండర్-14, 17 బాలబాలికలకు ఖో-ఖో, సాఫ్ట్‌బాల్, పవర్‌లిఫ్టింగ్, ఉషూ, సైక్లింగ్ బాలబాలికలకు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి గిడ్డయ్య తెలిపారు.

# ఉగాదికొస్తాం..!



గోనెగండ్ల ఎస్సీ కాలనీ నుంచి వాహనాల్లో వెళ్తున్న కూలీలు

- వలసెళ్లిపోతున్న పల్లె ప్రజలు
- పనుల కోసం పాట్లు
- హైదరాబాద్, గుంటూరు, రాజంపేటకు పయనం

గోనెగండ్ల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలోని ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, పత్తికొండ ప్రాంతల నుంచి వలస బండ్లు కదులుతున్నాయి. మూడు రోజులుగా గోనెగండ్ల మండలాల నుంచి ప్రజలు వలసలు పోతున్నారు. సోమవారం రాత్రి గోనెగండ్ల ఎస్సీ కాలనీ నుంచి వంద కుటుంబాలు తెలంగాణాలోని కేసంపేట అనే గ్రామానికి రెండు వాహనాల్లో వలస వెళ్లాయి. మూడు రోజుల నుంచి గోనెగండ్ల మండల గ్రామాల నుంచి 400 కుటుంబాలకు పైగానే హైదరాబాద్, గుంటూరు, రాయచూరు, రాజంపేట పట్టణాలకు కూలీలు వలసలు వెళ్లాయి. అక్కడ పత్తి పొలాల్లో పనులకోసం వెళ్తున్నట్లు కూలీలు చెబుతున్నారు. కిలో పత్తి తీస్తే రూ.13 ఇస్తారని, ఆ మేరకు ఒప్పందం కుదుర్చుకొని సుగ్గీ వెళ్తున్నామని చెబుతున్నారు. మళ్లీ ఉగాది పండుగకు ఊరికి వస్తామని కూలీలు బరువెక్కిన హృదయంతో ఊళ్లను వదిలేసి వెళ్తున్నారు. స్థానికంగా కూలీ పనులు లేవని, భార్యా పిల్లలు, తల్లిదండ్రులను పస్తులు ఉంచలేక ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది పంటలు సరిగా పండక పోవడంతో పనులు లేవు. గ్రామాల్లో అధికారులు సైతం ఉపాధి పనులు కల్పించడం లేదు. అరకొర పనులు కల్పించినప్పటికీ కూలీ డబ్బులు గిట్టుబాటు కాకపోవడం, అవి కూడా సకాలంలో చెల్లించకపోవడంతో ఇక గ్రామాల్లో లాభం లేదని వలసలు వెళ్తున్నామని పలువురు కూలీలు పేర్కొన్నారు. వేముగోడు గ్రామంతోపాటు గోనెగండ్ల, అలువాల, చిన్నమరివీడు, పెద్దనేలటూరు, కులుమాల, బైలుప్పల, అగ్రహారం, గంజహళ్లి గ్రామాల ప్రజలు ప్రత్యేక వాహనాల్లో ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారు.

### గ్రామంలో కూలీ పనులు లేవు



నెల రోజులుగా గ్రామంలో కూలీ పనులు లేవు. పూట గడవడం కష్టంగా మారింది. ఉపాధి పనులు కూడ సరిగా జరగడం లేదు. అందుకని తెలంగాణకు వలస పోతున్నాం. నేను, నా భార్య పిల్లలు అందరం వెళ్తున్నాం. అక్కడ పత్తి పని ఉంది. కేజీ పత్తి తీస్తే రూ.13 ఇస్తారు. అందుకే వెళ్తున్నాం. మళ్లీ ఉగాది వరకు వచ్చేది లేదు.

-మద్దిలేటి, గోనెగండ్ల

# మీసాలు, గడ్డాలు ఉండొద్దు





- మేం చెప్పిన కంటి అద్దాలే ధరించాలి
- కర్నూలు మెడికల్ కాలేజీలో ర్యాగింగ్
- జూనియర్లను వేధిస్తున్న సీనియర్లు

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మెడికల్ కాలేజీలో సీనియర్ విద్యార్థులు మొదటి సంవత్సరం విద్యార్థులను ర్యాగింగ్ చేస్తున్నారు. ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం మొదలై వారం రోజులకే సీనయర్ల వేధింపులు తీవ్రమయ్యాయి. దీంతో కొత్త విద్యార్థులు బయటకు చెప్పుకోలేక లోలోన కుమిలిపోతున్నారు. కర్నూలు మెడికల్ కాలేజీలో మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ సీట్లు 250 ఉన్నాయి. ఈ నెల 14న 240 మంది కొత్త వైద్య విద్యార్థులు చేరారు. సీనియర్లు ర్యాగింగ్ పేరుతో కొత్త విద్యార్థులను హింసిస్తున్నట్లు తెలుస్తోంది. సాయంత్రం తరగతులు ముగిసే సమయానికి గుంపులుగా చేరి ఐడీలను చూపాలని మొదటి సంవత్సరం విద్యార్థులను వేధింపులకు గురి చేస్తున్నారు. మీసాలు, గడ్డాలు తీసేసి కాలేజీకి రావాలని, తాము చెప్పిన కళ్లజోడు మాత్రమే పెట్టుకోవాలని, షూ లేకుండా చెప్పులతో కాలేజీకి హాజరు కావాలని హుకుం జారీ చేస్తున్నారు. అకాడమిక్ అంశాలకు సంబంధించిన పుస్తకాలను కొనవద్దని, తాము సూచించిన ఆన్‌లైన్ యాప్‌లను మాత్రమే కొనాలంటూ బెదిరింపులకు దిగుతున్నారు.

### మూడు రోజుల క్రితమే ర్యాగింగ్‌పై సదస్సు

కొత్తగా వచ్చిన ఎంబీబీఎస్ విద్యార్థులకు మూడు రోజుల క్రితమే కర్నూలు మెడికల్ కాలేజీలో ప్రిన్సిపాల్ అధ్యక్షతన యాంటి ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సుకు డిస్ట్రిక్ట్ లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ లీలా వెంకటశేషాద్రి, జిల్లా ఎస్పీ బిందుమాధవ్ హాజరై ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని, ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన శిక్షలు ఉంటాయని తెలిపారు. ఇటువంటి తరుణంలో సీనియర్లు వేధింపులకు పాల్పడుతుండడంతో మొదటి సంవత్సరం విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ విషయంపై కేఎంసీ ప్రిన్సిపాల్ డా.కే చిట్టినరసమ్మను వివరణ కోరగా ర్యాగింగ్ వేధింపుల విషయం తన దృష్టికి రాలేదన్నారు. ఈ నెల 31వ తేదీ వరకు నాన్ క్లినిక్‌లో పని చేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్‌ను హాస్టల్‌లో ఉండే విధంగా డ్యూటీలు వేశామని తెలిపారు.

# సాగునీటి సంఘాల ఎన్నికలకు నగారా



- గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిన కలెక్టర్
- జిల్లాలో 123 సంఘాలకు ఎన్నికలు
- ఆ తరువాత డిస్ట్రిబ్యూటరీ, ప్రాజెక్టు కమిటీల ఎంపిక

కర్నూలు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కేసీ కాలువ, తుంగభద్ర దిగువ కాలువ (టీబీపీ ఎల్లెల్సీ), హంద్రీనీవా, గాజులదిన్నె ప్రాజెక్టు పరిధిలోకి ఆయకట్టు రైతుల సాగునీటి సంఘాల సమరానికి సమయం ఆసన్నమైంది. జిల్లాలో 123 సంఘాలకు ఎన్నికలు నిర్వహణ, ఎన్నికల అధికారులను నియమిస్తూ కలెక్టరు పి.రంజిత్‌బాషా సోమవారం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఏఏ సంఘం పరిధిలో ఏఏ గ్రామాలు వస్తాయి.. ఎంత ఆయకట్టు ఉంది వంటి అంశాలు గెజిట్‌లో స్పష్టంగా వివరించారు. గత టీడీపీ ప్రభుత్వం 2015-26లో సాగు నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించింది. ఆ తరువాత వైసీపీ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకుండా ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసి నామినేటెడ్ పద్ధతిలో ఆ పార్టీ కార్యకర్తలకే పదవులు పంచుకున్నారు. మళ్లీ టీడీపీ కూటమి ప్రభుత్వం రావడంతో తొమ్మిదేళ్ల తరువాత పల్లెసీమల్లో సాగునీటి సంఘాల ఎన్నికలకు నగారా మోగింది. ఈ నెల 9న తేదీన రాష్ట్ర ప్రభుత్వం దాదాపు 40 రోజుల ఎన్నికల ప్రక్రియకు మంత్రి వర్గం ఆమోదం తెలిపి షెడ్యూల్ కూడా జారీ చేసింది. షెడ్యూల్ ప్రకారం అయితే 16 నుంచి ప్రక్రియ మొదలు కావాలి. అయితే సాంకేతిక కారణాలు, రెవెన్యూ, జలవనరుల శాఖ అధికారులు ఉమ్మడిగా ఆయకట్టు నిర్ధారణలో వంటి కారణాలు ప్రభుత్వం వాయిదా వేసింది. ఎట్టకేలకు వారం రోజులు ఆలస్యంగా గెజిట్ నోటిఫికేషన్ జారీ కావడంతో ఆయకట్టు రైతులు ఎన్నికల సన్నద్ధం కావాల్సి వచ్చింది. నవంబరు 29న ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందని అధికారులు తెలిపారు.

### 123 నీటి సంఘాలకు ఎన్నికలు

జిల్లాలో కేసీ కెనాల్ పరిధిలో 2, తుంగభద్ర దిగువ కాలువ (టీబీపీ ఎల్లెల్సీ) పరిధిలో 58, హెచ్చెల్సీ ఆలూరు బ్రాంచి కెనాల్ పరిధిలో 6, హంద్రీనీవా కెనాల్ పరిధిలో 3, గాజులదిన్నె ప్రాజెక్టు కింద 12, మైనర్ ఇగిరేషన్ చెరువుల కింద 41, రాంపురం చానల్ కెనాల్ కింద ఒకటి కలిపి 123 సాగునీటి సంఘాలు (డబ్ల్యూయూఏ) ఉన్నాయి. ఎంఐ పరిధిలోలో సంఘంలో సుమారుగా 30-50 మంది రైతులు, మేజర్ ఇరిగేషన్ సంఘాల పరిధిలో 100-120 మంది వరకు ఆయకట్టు రైతులు సభ్యులుగా ఉంటారని అంచనా వేస్తున్నారు. ఆయా సంఘాల పరిధిలో 1,212 మంది ప్రాదేశిక నియోజకవర్గం (టీసీ) సభ్యులను ఎన్నుకోవాలి. ప్రతి సంఘం పరిధిలో ఆరుగురు టీసీ సభ్యులను ఎన్నుకుంటే.. ఆ సభ్యుల్లో ఇద్దరిని అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎంపిక చేస్తారు. సాగునీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులను డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నుకుంటుంది. డిస్ట్రిబ్యూటరీ అధ్యక్షుడు సమావేశమై ప్రాజెక్టు కమిటీని ఎంచుకుంటారు. జిల్లాలో 123 సాగునీటి సంఘాలు, 10 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, 2 ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలు మూడు దశల్లో జరుగుతాయి.

### ప్రత్యేక అధీకృత అధికారుల నియామకం

గెజిట్ నోటిఫికేషన్‌తో పాటు ఎన్నికలు జరిగే సాగునీటి సంఘాలకు డీఈఈ, ఏఈఈ స్థాయి ప్రత్యేక అధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ అధికారి పర్యవేక్షణలో ఈ ఎన్నికలు జరుగుతాయి. ఆయా సాగునీటి కాలువ పరిధిలోని ఇంజనీర్లు, రెవెన్యూ అధికారులు (తహసీల్దార్లు) సమన్వయంతో ఆయకట్టు రైతులు, ఓటర్ల జాబితాను తయారు చేయాల్సి ఉంది. ఇందుకోసం జిల్లా నుంచి ప్రత్యేక అధీకృత రెవెన్యూ అధికారులను నియమించారు. డీఈఈ, ఏఈఈలు, తహసీల్దార్లు నివేదించిన ఓటర్ల జాబితాను కలెక్టరు లేదా ఆర్డీఓలు అధికారికంగా ప్రకటిస్తారు. ఓటర్ల జాబితా తయారీ కోసం ఇరిగేషన్ ఇంజనీర్లు తహసీల్దార్లకు సంపూర్ణ సహకారం అందించాలని కలెక్టరు పి.రంజిత్‌బాషా జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నారు.

# ఎప్పుడైనా కూలొచ్చు..!



**కర్నూలు, న్యూసిటీ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి):** కర్నూలు నగరానికి తాగునీటిని అందించే సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు ప్రమాదంలో పడింది. మునగలపాడు సమీపంలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు 16 పిల్లర్లు ఉన్నాయి. ప్రస్తుతం ఆ పిల్లర్లు మొత్తం శిథిలావస్థకు చేరుకున్నాయి. మొదటి రెండు పిల్లర్లు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని అమర్చిన కడ్డీలు బయటకు కనిపిస్తున్నాయి. అయినప్పటికీ కొందరు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుపైకి వెళ్తున్నారు. ఈ క్రమంలో శిథిలావస్థకు చేరుకున్న ట్యాంకు పిల్లర్లు ఏ క్షణమైనా కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. అనుకోని ప్రమాదం జరగకముందే అధికారులు అప్రమత్తం కావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సమ్మర్ స్టోరేజీ ట్యాంకుకు సంబంధించి మరమ్మతులను ఉన్నతాధికారులతో కలిసి యుద్ధప్రాతిపదికన చేపడతామని నగర పాలక ఎస్ఈ రాజశేఖర్ తెలిపారు.









# ఉద్యోగ్యం పేరుతో మోసం

- పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో బాధితుల ఫిర్యాదు
- చట్ట ప్రకారం విచారణ చేసి న్యాయం చేస్తాం
- కర్నూలు ఎస్పీ జి.బిందు మాధవ్

**కర్నూలు క్రైం అక్టోబరు 21, (ఆంధ్రజ్యోతి):** ఉద్యోగాలు ఇప్పిస్తామని తమను మోసగించారని పలువురు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎస్పీని కలిసి తమ గోడును వెలుబుచ్చారు. సోమవారం కర్నూలు నగరంలోని క్యాంపు కార్యాలయంలో ఎస్పీ బిందుమాధవ్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు.

ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. మొత్తం 100 వినతులు వచ్చాయి. అలాగే వృద్ధురాలి వద్దకు నేరుగా వెళ్లి ఫిర్యాదు స్వీకరించి న్యాయం చేస్తానని ఎస్పీ భరోసా ఇచ్చారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని ఎస్పీ జి.బిందు మాధవ్ హామీ ఇచ్చారు. అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు, సీఐ శివశంకర్ పాల్గొన్నారు.



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ జి.బిందు మాధవ్

**ఇవీ వినతులు..**

కర్నూలు ఫుడ్ కార్పొరేషన్ డిపార్టుమెంట్‌లో ఉద్యోగం ఇప్పిస్తామని రూ.3.5 లక్షలు తీసుకుని తనను కర్నూలుకు చెందిన ఆయేషా బాను మోసగించిందని వినయ్‌గౌడ్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు.

- నదీతీర ప్రాంతాల పోర్టులో థర్డ్ ఆఫీసర్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి కర్నూలుకు చెందిన వై.నాగేశ్వరరావు రూ.ఏడు లక్షలు తీసుకుని మోసం చేశాడని ఆదోనికి చెందిన ప్రవీణ్ ఫిర్యాదు చేశారు.
- అత్తమామలు కుటుంబ సమస్యలు, అవసరాల కోసం తన బంగారం తీసుకుని వాడుకున్నారు. ఇప్పుడు అడిగితే.. ఇవ్వడం లేదని కర్నూలు పసుపుల గ్రామానికి చెందిన లక్ష్మిదేవి అనే మహిళ ఫిర్యాదు చేసింది. న్యాయం చేయాలని వేడుకున్నది.
- తాను అనంతపురంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాను. నాకు ఫేస్‌బుక్ ద్వారా కార్తీక్ పరిచయం అయ్యాడు. రూ.7 లక్షలు తీసుకుని మోసం చేశాడని గూడూరు మంలం నాగులాపురం చెందిన సలీమా ఫిర్యాదు చేశారు.
- నా కుమార్తె కేశమ్మ ఎంబీఏ చేసింది. నా కుమార్తెకు ఆల్ఫాబీట్ గ్రూప్ కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి నమ్మించి రూ.4 లక్షలు తీసుకుని మోసం చేసిన అనంతపురం చెందిన సత్యనారాయణపై చర్యలు తీసుకోవాలని గూడూరు మండలం గుడిపాడుకు చెందిన రైతు దుబ్బన్న ఫిర్యాదు చేశారు.
- తనకు ఇద్దరు కుమారులు, చిన్న కుమారుడికి కంటి చూపు సరిగ్గా లేదు. పెద్ద కుమారుడు వెంకటేశ్వర ఆచారి నాకు వచ్చిన ఇల్లును తీసుకుని అన్నం, బాగోగులు చూడడం లేదని, బిక్షాటన చేయిస్తున్నాడని కర్నూలుకు చెందిన మునెమ్మ ఫిర్యాదు చేసింది.

# పన్ను వసూళ్లలో గణనీయ వృద్ధి



పన్ను వివరాలను కమిషనర్‌కు అందజేస్తున్న అడిషనల్ కమిషనర్

- కమిషనర్ ఎస్.రవీంద్రబాబు

**కర్నూలు, న్యూసిటీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):** నగర పాలక సంస్థ పరిధిలో పన్ను వసూళ్లలో గణనీయ వృద్ధి సాధించినట్లు కమిషనర్ ఎస్.రవీంద్రబాబు తెలిపారు. ఈ నెల 17 నుంచి రెవెన్యూ విభాగం చేపట్టిన ప్రత్యేక డ్రైవ్ ద్వారా రూ.94,53,000 పన్ను వసూలు చేసిన వివరాలను అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ కమిషనర్‌కు అందజేశారు. కమిషనర్ మాట్లాడుతూ నగరాభి వృద్ధికి పన్నులు ఎంతో కీలకమన్నారు. దీనిని గ్రహించి ప్రజలు స్వచ్ఛందంగా సహకరించడం సంతోషంగా ఉందన్నారు. ప్రత్యేక డ్రైవ్‌లో ఆస్తిపన్ను రూ.89,25,000, నీటి పన్ను రూ.5,28,000 వసూలు చేశారన్నారు. నూతనంగా నియమితులైన ఆర్ఐలు పన్ను వసూలు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. సిబ్బందిని కమిషనర్ అభినందిం చారు. ఆర్వో జునైద్, ఆర్ఐలు శేషాద్రి, ఎం.రాజు, ఎస్.తిప్పన్న, పి.భార్గవత, ఎం.నాగరాజు ఉన్నారు.

# నిశ్చితార్థాలను అడ్డుకున్న అధికారులు



తల్లిదండ్రులకు అవగాహన పత్రం ఇస్తున్న డీసీపీవో శారద

**కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):** జిల్లాలో ఒకేసారి ఇద్దరు బాలికల నిశ్చితార్థాలను ఐసీడీఎస్, ఐసీపీఎస్ అధికారులు అడ్డుకున్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటలక్ష్మి ఆదేశాల మేరకు మూడు ప్రాంతాల్లో అడ్డుకున్నారు. సి.బెళగల్ మండలం కంబదహాల్ గ్రామంలో 15 సంవత్సరాల బాలిక, కర్నూలు మండలం గొందిపర్లలో 17 సంవత్సరాల అమ్మాయిలకు చేస్తున్న నిశ్చితార్థం కార్యక్రమాన్ని అడ్డుకుని తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. డీసీపీవో టి.శారద మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం వల్ల శారీరక మానసిక సమస్యలతోపాటు పుట్టబోయే పిల్లలు ఆరోగ్యంగా జన్మించరని తెలిపారు. కౌన్సెలింగ్ ఇవ్వగా తల్లిదండ్రులు సమ్మతించి నిశ్చితార్థాన్ని విరమించారు. తల్లిదండ్రులు అంగీకార పత్రాన్ని అధికారులకు రాసి ఇచ్చారు. డీసీపీవో టి.శారద, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మ, మల్లేశ్వరి, డీసీపీయూ సిబ్బంది నరసింహులు, నాగేశ్వరరావు, శ్వేత, కీర్తి, మహిళా పోలీసు సృజన నాయుడు, ఆర్గనైజేషన్ మధు, రామచేంద్ర పాల్గొన్నారు.

# టోల్ ఫ్రీ నెంబర్లపై అవగాహన ఉండాలి



ఆటోకు పోస్టర్ అంటిస్తున్న ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

**నంద్యాల క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):** టోల్ ఫ్రీ నెంబర్లు 112, 1930పై అవగాహన కలిగి ఉండాలని నంద్యాల ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయం వద్ద జిల్లా మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జయరాములు, రమేష్ బాబుతో కలిసి 112, 1930 టోల్ ఫ్రీ నెంబర్లపై ముద్రించిన పోస్టర్లను ఆటోలకు అతికించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళలు, చిన్న పిల్లలు, ఇతరులు ఎవరైనా బాల్య వివాహాలు, వరకట్న వేధింపులు, లైంగిక వేధింపులు, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, గృహ హింస, అవమానానికి గురిచేయడం, బెదిరించడం తదితర వాటివల్ల ఇబ్బంది పడినట్లయితే వెంటనే 112, 1930 టోల్ ఫ్రీ నెంబర్లకు ఫోన్ చేయాలన్నారు. అలాగే సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ వంటి వాటిద్వారా సైబర్ నేరగాళ్ల చేతిలో పడి మోసపోయి ఉంటే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. ఈ నెంబర్లపై అవగాహన కోసమే ఆటోలకు అతికించామని అన్నారు. కార్యక్రమానికి నాంది పలికిన జిల్లా మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జయరాములును ఎస్పీ అభినందించారు.

# ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలి



మాట్లాడుతున్న లక్ష్మీనరసింహ యాదవ్

**నంద్యాల క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలని డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 22 నుంచి 28 వరకు జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో పోస్టు కార్డు ఉద్యమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. సోమవారం నంద్యాలలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాక ముందు ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్‌సిక్స్‌లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. ప్రభుత్వ మేర్పడి నాలుగు నెలలు కావస్తున్నా ఆ హామీ అతీగతి లేదని విమర్శించారు. ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పిలుపు మేరకు వారం రోజులపాటు జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాల కేంద్రాల్లో పోస్టుకార్డు ఉద్యమం చేపట్టామన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జులు, కో ఆర్డినేషన్ సభ్యులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఓపీ విధుల్లో ఉండాలి

**కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):** కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రోగులు ఓపీ విభాగాల్లో ఉదయం, సాయంత్రం వైద్యులు తప్పనిసరిగా సేవలు అందించాలని ఓపీ మానిటరింగ్ కమిటీ సభ్యులు హెచ్చరించారు. సోమవారం ఉదయ గైనిక్, ఫ్యామిలి ప్లానింగ్, పీడీయాట్రిక్ విభాగాల ఓపీ సేవలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి నెల 5న ఓపీ సేవల వివరాలను కమిటీ సభ్యులు డీఎంఈకి నివేదిక పంపనున్నట్లు సీఎస్ఆర్ఎంవో తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సీఎస్ఆర్ఎంవో డాక్టర్ వెంకటేశ్వరరావు, యురాలజీ హెచ్‌వోడీ సీతారామయ్య, సైక్రియాట్రిక్ హెచ్‌వోడీ నాగేశ్వరరావు ఉన్నారు.

## డ్రోన్స్ సమ్మిట్‌కు సుబ్బారెడ్డికి ఆహ్వానం

**డోన్ అక్టోబరు 21, (ఆంధ్రజ్యోతి):** అమరావతిలో ఈ నెల 22, 23 తేదీల్లో నిర్వహించే డ్రోన్స్ సమ్మిట్ కార్యక్రమానికి రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డికి ఆహ్వానం వచ్చింది. డ్రోన్స్ సమ్మిట్ కార్యక్రమంలో జరిగే వర్క్‌షాపులో పాల్గొనాలని ఆహ్వానం పంపారు. దీంతో సుబ్బారెడ్డి విజయవాడకు వెళ్లారు. ఇది ఒక మంచి అవకాశంగా భావిస్తున్నట్లు సుబ్బారెడ్డి తెలిపారు.

# చిన్నారుల బాధ్యత ప్రభుత్వానిదే



చిన్నారులతో ఐసీడీఎస్, ఎసీపీఎస్ అధికారులు

**పత్తికొండ, అక్టోబరు 21 :** మండలంలోని మారెళ్ల గ్రామంలో తల్లిదం డ్రులను కోల్పోయిన చిన్నారుల బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని పత్తికొండ సీడీపీవో లలిత అన్నారు. సోమవారం కర్నూలు నుంచి వచ్చిన ఐసీపీఎఫ్ (ఇంటిగ్రేటెడ్ చిల్డ్రన్స్ ప్రొటెక్షన్ స్కీం) అధికారులు పద్మ, శ్రీలక్ష్మి చిన్నారులతో మాట్లాడారు. చట్టప్రకారం తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలను చైల్డ్‌వెల్ఫేర్ కమిటీకి అప్పగించాల్సి ఉంటుందని అన్నారు. వారి విద్యాభ్యాసానికి ఏర్పాట్లు చేస్తామన్నారు. బంధువులు చిన్నారుల బాధ్యత వహిస్తామని కోరితే నిబంధనల మేరకు అనుమతిస్తామన్నారు. సూపర్ వైజర్ సుమిత్ర, కార్యకర్త ఉన్నారు.

## పట్టపగలే చోరీ

**కోసిగి అక్టోబరు 21, (ఆంధ్రజ్యోతి):** పట్టపగలు గుర్తు తెలియని వ్యక్తులు ఓ ఇంట్లోకి చొరబడి బంగారం, నగదు దోచుకెళ్లారు. ఈ ఘటన కోసిగి మండల కేంద్రంలోని దొరల చావిడి సమీపంలో సోమవారం చోటు చేసుకున్నది. బాధితురాలు జక్కనగేని శివమ్మ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జక్కనగేని ఉశేనీ, శివమ్మ దంపతులు. ఉశేనీ, తన కూతురుతో కలిసి పుణ్యక్షేత్ర తీర్థాలకు వెళ్లారు. ఇద్దరు కుమారులు బడికి వెళ్లడంతో రోజులాగే ఇంటికి తాళం వేసి ఉల్లి నారు వేసేందుకు కూలి పనికి శివమ్మ వెళ్లింది. అయితే గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగులకొట్టి బీరువాలో ఉన్న రూ.1.40 లక్షల నగదు, రెండున్నర తులాల బంగారం దోచుకెళ్లారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ పి.చంద్రమోహన్ సంఘటనాస్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. దొంగలు ఇంట్లోనే బీర్ సీసా పగులకొట్టారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# మొరాయించిన ఈ నామ్ సర్వర్

- పాత పద్ధతిలోని టెండర్ దాఖలు



విక్రయానికి వచ్చిన పత్తి దిగుబడులు

**ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 21, (ఆంధ్రజ్యోతి) :** ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈ-నామ్ సర్వర్ సోమవారం సాంకేతిక సమస్యతో మొరాయించింది. అప్రమత్తమైన కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి సమస్య పరిష్కారం కావడానికి ఒక్కరోజు పట్టవచ్చని తెలియడంతో పాత పద్ధతిలోని టెండర్లు వేయాలని మైకు ద్వారా ప్రకటించారు. దేశవ్యాప్తంగా మార్కెట్ యార్డులో సర్వర్ పని చేయక పాత పద్ధతిలోనే టెండర్లను దాఖలు చేశారు. ఖరీఫ్ సీజన్ పత్తి, వేరుశనగ, ఆముదం, పొద్దుతిరుగుడు దిగుబడు లను రైతులు విక్రయానికి భారీగా తీసుకొస్తు న్నారు. ఇలాంటి సమయంలో సర్వర్ మొరాయిస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తూకాలు సాయంత్రం ఆరు గంటలకు ప్రారంభమయ్యాయి.

## నిందితుల అరెస్టు

**కర్నూలు క్రైం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి):** ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసిన కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు నాలుగో పట్టణ సీఐ మధుసూదన్‌గౌడ్ తెలిపారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన సురేష్, భార్య ధనలక్ష్మి హైదరాబాద్‌లో నివాసముంటున్నారు. కర్నూలుకు చెందిన అనూషతోపాటు మరో 18 మందికి ఉద్యోగాలు ఇస్తామని చెప్పి, నకిలీ ఉద్యోగ పత్రాలు ఇచ్చి రూ.95 లక్షలు వసూలు చేసి మోసం చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.



# కారు బోల్తా

- ఐదుగురికి తీవ్ర గాయాలు

**ఆళ్లగడ్డ(శిరివెళ్ల), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) :** కారు బోల్తా పడి, ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన కర్నూలు-చిత్తూరు 40వ జాతీయ రహదారిపై పేరాయిపల్లె మెట్ట వద్ద సోమవారం చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరుకు చెందిన ఓ కుటుంబ సభ్యులు మహానందిలో స్వామి వారిని దర్శించుకుని అహోబిలం వెళ్తుండగా పేరాయిపల్లె వద్ద కారు టైరు పేలడంతో ప్రమాదం చోటు చేసుకుంది. దీంతో కారు పల్టీలు కొట్టి డివైడర్‌ను దాటి నంద్యాల వైపు వెళ్లే రహదారిలో బోల్తా పడింది. ఈ ఘటనలో సాయి వెంకటేష్, రమాదేవి, ఝాన్సీ, సుధీర్, శశి తీవ్రంగా గాయపడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆళ్లగడ్డ రూరల్ ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు.



ప్రమాదానికి గురైన కారు

## యువకుడికి రిమాండ్

**ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):** కిడ్నాప్ కేసులో ఓ యువకుడిని రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం ఎస్ఐ మాట్లాడుతూ మండల పరిధిలోని పార్లపల్లి గ్రామానికి చెందిన మాదిగ అభిలాష్ అనే యువకుడు ఓ బాలికను ఎత్తుకెళ్లడంపై కేసు నమోదు అయింది. యువకుడిని కోర్టులో హాజరుపరిచి న్యాయాధికారి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

# కర్నూలు

కర్నూలు ● కోడుమూరు ● పాణ్యం

## ధూపదీపం కరువు




**ఓర్వకల్లు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన కాల్వబుగ్గ గ్రామ సమీపాన గల బ్రిటీష్ కాలం నాటి వంతెన సమీపంలోని చిన్నబుగ్గ రామేశ్వరుని ఆలయంలో ధూపదీపాలు కరువయ్యాయి. ఈ ఆలయానికి నాలుగెకరాల దేవుని మాన్యం ఉంది. అంతేగాకుండా ఎండోమెంటు పరిధిలో ఉన్నా అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఆలయంలో పూజలు చేసే అర్చకునికి మాత్రం ప్రతి నెలా రూ.15 వేలు ఆలయ ఈవో జీతభత్యాలు ఇస్తున్నట్లు తెలుస్తోంది. కాల్వ గ్రామంలో ఉన్న ప్రజలు చిన్నబుగ్గ ఆలయానికి వచ్చి అక్కడ పూజలు చేసి అనంతరం కాల్వబుగ్గ దేవస్థానంలో పూజలు చేసేవారు. ఇటీవల అలాంటి పూజ కార్యక్రమాలు కూడా చేయడం లేదని భక్తులు చెబుతున్నారు. ఆలయం ఎప్పుడూ తలుపులు వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హుశేనాపురం గ్రామానికి చెందిన సాదు మద్దిలేటి అనే భక్తుడు పౌర్ణమి, కార్తీక మాసాల్లో భక్తుల సహకారంతో అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తుంటారని హుశేనాపురం గ్రామ ప్రజలు తెలిపారు. ఇప్పటికైనా దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు చిన్నబుగ్గ రామేశ్వరుని ఆలయంలో ప్రతి రోజూ పూజలు జరిగేలా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

### పూజలు జరగడం లేదు



పూర్వం చిన్నబుగ్గ రామేశ్వరుని శివాలయం నిర్మించారు. అయితే అప్పట్లో పూజలు బాగా జరిగేవి. ప్రస్తుతం కొంత కాలంగా పూజలు జరగడం లేదు. దీంతో భక్తులు పలు ఇబ్బందులు పడుతున్నారు.

- కేవీ మధు, భక్తుడు

### దాతల సహకారంతో ఆలయం అభివృద్ధి



బుగ్గ రామేశ్వరుని ఆలయాన్ని భక్తుల సహకారంతో ఎంతో అభివృద్ధి చేశాం. ఈ ఆలయం ఎండోమెంటులో ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. పూజలు కూడా కరువయ్యాయి. కార్తీక మాసం, పౌర్ణమి రోజున భక్తులు అధిక శాతం వచ్చి మొక్కులు చెల్లించుకుంటున్నారు. ప్రతి రోజూ ఆలయంలో పూజలు చేయాలి.

- సి.నాగరాజు, భక్తుడు

### నిత్య పూజలు జరిపించాలి



ఈ ప్రాంతంలో పవిత్రమైన రామేశ్వరస్వామి ఉన్నారు. అయితే.. పూజలు జరగడం లేదు. భక్తులు బయటి నుంచే మొక్కులు చెల్లించుకునే పరిస్థితి ఉంది. ప్రతి రోజూ స్వామి వారికి పూజలు చేసేలా చర్యలు తీసుకోవాలి.

- గొల్ల నాగరాజు, భక్తుడు

## గ్రామ పంచాయతీకి అనుసంధానం చేయాలి



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న బిర్రు ప్రతాప్ రెడ్డి

**కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):** సచివాలయ వ్యవస్థను గ్రామ పంచాయతీకి అనుసంధానం చేయాలని ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ప్రధనా కార్యదర్శి బిర్రు ప్రతాప్ రెడ్డి కోరారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్య పరిష్కార వేదికలో కలెక్టర్ రంజిత్ బాషాకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందన్నారు. ప్రతి సచివాలయంలో 11మంది ఉద్యోగులను నియమించి వారిపైన సరైన పర్యవేక్షణ, నియంత్రణ లేక తీవ్ర గందరగోళంగా తయారైందని ఆరోపించారు. కార్యక్రమంలో ఎన్.లెనిన్‌బాబు, పి.దామోదర్ రెడ్డి, బాలపీరా పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలి

### అడిషనల్ కమిషనర్‌కు కాలనీ వాసుల వినతి



అడిషనల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

**కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి):** శాంతినగర్ కాలనీలో సమస్యలను పరిష్కరించాలని సోమవారం నగర పాలక కార్యాలయంలో అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు పి.మల్లికార్జున మాట్లాడుతూ కాలనీల్లో పగలు పాములు, రాత్రి దోమలు సంచరిస్తున్నాయన్నారు. వర్షం పడితే రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయన్నారు. రూ.కోటితో నిర్మించిన మరుగు కాలువ నిరుపయోగంగా ఉందన్నారు. ఇళ్ల ముందు డ్రైనేజీలు నిర్మించి కాలువలో కలపాలని డిమాండ్ చేశారు. పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఇరిగినేని పుల్లారెడ్డి, కాలనీవాసులు స్వామినాయక్, లక్ష్మమ్మ, ఖాజాబీ, రమాదేవి పాల్గొన్నారు.

## 'స్పీడ్ బ్రేకర్లను తొలగించాలి'

**కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి):** నగరంలోని పలు ప్రాంతాల్లోని ప్రధాన రహదారుల్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన స్పీడ్ బ్రేకర్లను తొలగించాలని అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 14 ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా అడిషనల్ కమిషనర్ మాట్లాడుతూ కొన్ని ప్రాంతాలలో అనవసరంగా వేసిన స్పీడ్ బ్రేకర్లతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నట్లు ఫిర్యాదులు వచ్చాయన్నారు. నిబంధనలు పాటించకుండా వేసిన స్పీడ్‌బ్రేకర్లను తొలగించాలని ఎంఈ సత్యనారాయణను ఆదేశించారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, మేనేజర్ చిన్నరాముడు, ఆరోగ్య అధికారి కే.విశ్వేశ్వరరెడ్డి, రెవెన్యూ అధికారి జునైద్, టీపీఆర్‌ఓ వెంకటలక్ష్మి, టిడ్కో అధికారి పెంచలయ్య పాల్గొన్నారు.

## వినతులను త్వరగా పరిష్కరించాలి

**గూడూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి):** ప్రజల నుంచి వచ్చిన వినతులను త్వరగా పరిష్కరించాలని తహసీల్దార్ రామాంజనేయులు అన్నారు. సోమవారం గూడూరు తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి తహసీల్దార్ రామాంజనేయులు వినతులను స్వీకరించారు.

## కార్మికుల వివరాలను ఇవ్వండి

**కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి):** నగర పాలక సంస్థలోని ఇంజనీరింగ్ విభాగంలో పని చేస్తున్న రెగ్యులర్, అప్కాస్ కార్మికుల వివరాలను ఇవ్వాలని ఎస్‌ఈ రాజశేఖర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇంజనీరింగ్ విభాగం కింద నీటి సరఫరా, వీధి లైట్లు, పార్కులలో పనిచేస్తున్న రెగ్యులర్ కార్మికులు కొందరు బదిలీ కావడంతో వారు వేరే వారితో పని చేయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. రెగ్యులర్, బదిలీ కార్మికులు కూడా తమకు కేటాయించిన ప్రాంతాలలో పనులు చేయకుండా ఉడాయిస్తున్నారని అన్నారు. అనధికారికంగా పనులు చేస్తున కార్మికులను డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, అసిస్టెంట్ ఇంజనీర్లు గుర్తించా లని పేర్కొన్నారు. ఈనెల 25లోపుల పూర్తి వివరాలను నివేదిక రూపంలో అందజేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## పెండింగ్ జీతాలు చెల్లించాలి

**కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి):** ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న స్వీపర్లకు పెండింగ్ జీతాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మునెప్ప మాట్లాడుతూ స్వీపర్లకు నాలుగు నెలలుగా జీతాలు పెండింగ్ ఉన్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. జీతాలు రాకపోవడంతో కుటుంబపోషణ భారమైందన్నారు. పత్తికొండ నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం వచ్చాక 30నుంచి 40మందిని తొలగించారని అన్నారు. కార్యక్రమంలో సుంకమ్మ, చంద్రశేఖర్, రంగన్న, లక్ష్మీదేవి, హేమావతి పాల్గొన్నారు.

## ఉద్యోగులకు కౌన్సెలింగ్ నిర్వహించాలి

**కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి):** నగర పాలక సంస్థ పరిధిలో పని చేస్తున్న సచివాలయ ఉద్యోగులకు కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు చేపట్టాలని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బతుకన్న కోరారు. సోమవారం నగర పాలక కార్యాలయంలో అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బతుకన్న మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టబోయే రెగ్యులర్ బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రతాప్, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

## దివ్యాంగులకు ల్యాప్‌టాప్‌ల పంపిణీ

**కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి):** కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో సోమవారం దివ్యాంగులకు ల్యాప్‌ట్యాప్‌లు, స్మార్ట్ టచ్ ఫోన్లు కలెక్టర్ పి.రంజిత్ బాషా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగుల అవసరాలకు అనుగుణంగా ఇంటర్మీడియట్ చదువుతున్న జి.మోహన్, ఎం.వేణు, ఎం.చందు ముగ్గురు దివ్యాంగులకు స్మార్ట్‌టచ్ ఫోన్లను, డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్న దివ్యాంగురాలు రేవతికి ల్యాప్‌టాప్‌ను విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అందజేస్తున్నామని తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకుని ఉన్నత చదువులు చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల సహాయ సంచాలకులు రయిస్ ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

## శుశృత భవన్‌కు కొత్త పైపులు

**కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి):** ఏళ్ల తరబడి శుశృత భవన్ (బూత్ బంగ్లా) వద్ద నెలకొన్న డ్రైనేజీ సమస్య రోగులకు ఇబ్బందిగా మారింది. డ్రైనేజీకి చెందిన పాత పైపులు దెబ్బతినడంతో మురుగునీరు ముందుకు సాగక ఆ ప్రాంతం దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో బూత్ బంగ్లాలో చికిత్స పొందుతున్న రోగులు దుర్వాసనను భరించలేక అవస్థలు పడుతున్నారు. ఈ విషయాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. పాత పైపుల స్థానంలో కొత్తగా పైపులను ఏర్పాటు చేసి మురుగునీరును సెప్టిక్ ట్యాంకుకు అనుసంధానం చేసి ఎన్నో ఏళ్లుగా నెలకొన్న సమస్యను సూపరింటెండెంట్ పరిష్కరించారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత

**కల్లూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి):** క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా టీడీపీ కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. సోమవారం కల్లూరు ఎంపీడీఓ కార్యాలయంలో జి.నాగశేషాచలరెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఎమ్మెల్యే పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మండల వ్యాప్తంగా మొత్తం 113 వినతులు నమోదయ్యాయి. ఈసందర్భంగా పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ ప్రజలు సమస్యలను అధికా రులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. గ్రీవెన్స్‌కు వచ్చిన అర్జీలు మరలా రిపీట్ కాకుండా అధికారులు ప్రజలు, రైతులకు సేవలందించాలని అదే శించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల్లో రెవెన్యూ శాఖ-44, పంచాయతీ రాజ్-17, డీఆర్‌డీఏ-14, ఆర్‌డబ్ల్యూఎస్-10, విద్యుత్ శాఖ-6 ఉన్నాయి. కార్యక్రమంలో తహసీల్దారు కె.ఆంజనేయులు, ఏపీ ఫైనాన్స్ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ డి.రామాంజనేయులు, టీడీపీ నాయకులు ఈవీ రమణ. వినోద్, సర్పంచు సహరాబీ, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## 'ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలి'



పోస్టర్లను విడుదల చేస్తున్న అధికారులు

**ఓర్వకల్లు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):** ప్రతి ఒక్కరూ అయోడిన్ (ఉప్పు)పై అవగాహన పెంచుకోవాలని రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమం అధికారి హేమలత అన్నారు. సోమవారం మండలంలోని నన్నూరు పీహెచ్‌సీ పరిధిలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రపంచ అయోడిన్ లోప వ్యాధుల నివారణ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హేమలత మాట్లాడుతూ అయోడిన్ (ఉప్పు) లోపంతో వచ్చే రుగ్మతల గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. అయోడిన్ లోపంతో చిన్నారుల్లో ఎదుగుదల లోపం, బుద్ధి మాంద్యం, పెద్దవయస్సు వారికి థైరాయిడ్ సమస్యలు వస్తాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు సుధాకర్, నాగరాజు, డెమో శ్రీనివాసులు, డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు ప్రాణేష్ కుమార్, ఆరోగ్య, సచివాయల సిబ్బంది పాల్గొన్నారు.

## పండ్ల తోటల పరిశీలన

**సి.బెళగల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని మారందొడ్డి, బ్రాహ్మణదొడ్డి, ఇనగండ్ల గ్రామాల్లోని పండ్ల తోటలను కోడుమూరు ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్‌గౌడు సోమవారం పరిశీలించారు. హార్టికల్చర్ అసిస్టెంట్లు చెంచురాజు, నాగన్న రైతులు ఉన్నారు.

## గ్రామ సభలను వినియోగించుకోవాలి

**సి.బెళగల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):** రెవెన్యూ గ్రామసభలను రైతులు వినియోగించుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ రీ సర్వే జరిగిన గ్రామాల్లో ప్రభుత్వం గ్రామ సభలను నిర్వహిస్తుందన్నారు. ఈ నెల 23వ తేదీన బురాన్‌దొడ్డి, 24న గుండ్రేవుల, 25న కొండాపురం, 26న కొత్తకోట, 29న సభలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

## తూనికలు, కొలతల శాఖ అధికారుల తనిఖీలు

### నాలుగు కేసులు, రూ.20 వేల అపరాధ రుసుము వసూలు

**కర్నూలు, న్యూసిటీ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి):** నగరంలోని వినాయకఘాట్ వద్ద పండ్ల బండ్లు, నంద్యాల చెక్‌పోస్టు వద్ద సూపర్‌మార్కెట్, హార్డ్‌వేర్, ఎలక్ట్రికల్ దుకాణాలను తూనికలు, కొలతల శాఖ అధికారులు తనిఖీలు చేశారు. సోమవారం జరిపిన తనిఖీల్లో ప్యాకేజీల మీద తగిన డిక్లరేషన్ లేకపో వడంతో నాలుగు కేసులు నమోదు చేసి రూ.20 వేల అపరాధ రుసుము వసూలు చేశారు. ఈ సందర్భంగా తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ పరమేశ్వరకుమార్ మాట్లాడుతూ ఎవరైనా దుకాణదారులు ఎక్కువ ధరకు అమ్మినా, తూనికపు యంత్రాలు, రాళ్లకు ముద్రలు లేకుండా వాడిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాసులు ఉన్నారు.

## నిబంధనలు పాటించాలి: ఎక్సైజ్ సీఐ



ఎక్సైజ్ సీఐ మంజుల

**కోడుమూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):** ప్రభుత్వ నిబంధనల మేరకు మద్యం షాపులను నిర్వహించాలని ఎక్సైజ్ సీఐ మంజుల అన్నారు. స్థానిక ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో సోమవారం ఆమె మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని కోడుమూరు, గూడూరు, సి.బెళగల్, వెల్దుర్తి, క్రిష్ణగిరి మండలాల్లోని 14 మద్యం దుకాణాలు ప్రభుత్వం నిబంధనల ప్రకారం షాపులు నడుస్తున్నా యని తెలిపారు. బడి, ప్రార్థన మందిరాలు, 30 పడకల ఆసుపత్రులకు 100 మీటర్ల దూరంలో మద్యం షాపులు ఏర్పాటు చేశామన్నారు. సి.బెళగల్‌లోని రెండు మద్యం షాపులకు పట్టణంలో ఏర్పాటుకు చేసేందుకు బడి, ప్రార్థన మందిరాలు వంటి సమస్యలు ఉన్నాయి. ప్రస్తుతం తాత్కాలిక లైసెన్సు ఇచ్చి మద్యం దుకాణం ఏర్పాటు చేయించాం. ఈ మద్యం షాపులు కూడా రేపటిలోపు బడి, ప్రార్థన మందిరాలకు దూరంగా ఏర్పాటు చేయించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. లైసెన్సు దారులు మద్యం షాపుల దగ్గర సిట్టింగ్ ఏర్పాటు చేయించి తాగించడం చట్టప్రకారం నేరమని, ప్రభుత్వం పరిమిట్ రూంలకు ఎలాంటి అనుమతులు ఇవ్వ లేదని అన్నారు. మద్యం ఎమ్మార్పీకే విక్రయించాలని, అధికంగా విక్రయిస్తే లైసెన్సు రద్దు చేస్తామని ఆమె హెచ్చరించారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్ర మే దుకాణాల్లో మద్యం అమ్మకాలు కొనసాగించాలని, నిబంధనలు తప్పకుండా పాటించాలని లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## 'మూఢ నమ్మకాల నిర్మూలనకు కృషి చేద్దాం'



మాట్లాడుతున్న ఎన్‌కే జయన్న

**కర్నూలు కల్చరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):** సమాజంలో నేటికీ కొనసాగుతున్న మూఢ నమ్మకాలు, సామాజిక దురాచారాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏపీ హేతువాద సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్‌కే జయన్న పిలుపునిచ్చారు. సోమవారం నగరం లోని టీజీవీ కళాక్షేత్రంలో నవంబరు 9, 10వ తేదీల్లో ఒంగోలు సీపీఐ కార్యాలయంలో నిర్వహిస్తున్న 'ఏపీ హేతువాద సంఘం రాష్ట్ర మహా సభలు' కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎన్‌కే జయన్న మాట్లాడుతూ ఏపీ హేతువాద సంఘం రాష్ట్ర మహాసభలకు విద్యార్థులు, మేధావులు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ హేతువాద సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జేవీ కృష్ణయ్య, రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు డాక్టర్ రామగోపాల్, సీవీ వర్మ, బి.నాగభూషణం, రామశేషయ్య, మల్లికార్జున, గాంధీ, సలీంబాషా, అజీజ్ పాల్గొన్నారు.

## గృహ నిర్మాణాన్ని వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న హౌసింగ్ ఏఈ జమన్న

**గూడూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):** గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ ఏఈ జమన్న అన్నారు. సోమవారం గూడూరు మండలం కె నాగలాపురం గ్రామంలో లబ్ధిదారులతో ఆయన సమావేశ మయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కె.నాగలాపురం లేఅవుట్‌లో మొత్తం 83 గృహ నిర్మాణాలు మంజూరు కాగా, దాదాపు 30 గృహలు పూర్తి కాగా మిగిలినవి వివిధ నిర్మాణ దశలో ఉన్నాయని అన్నారు. సమావేశంలో తహసీల్దార్ రామాంజనేయులు, ఎంపీడీవో శివనాగ ప్రసాద్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఓబీసీ రిజర్వేషన్ అమలు చేయాలి

**కల్లూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి):** ఏపీ వీరశైవ లింగాయత్‌లకు విద్యా, ఉద్యోగాల్లో ఓబీసీ రిజర్వేషన్ అమలు చేయాలని సంఘం నాయకులు చామకూర వీరప్ప కోరారు. సోమవారం మాధవీ నగర్‌లోని ఎమ్మెల్యే స్వగృహంలో ఏపీ వీరశైవ లింగాయత్, లింగ బలిజ ఓబీసీ సాదన సమితి తరపున పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితకు వినతిపత్రం అందజేశారు. వీరశైవ లింగాయత్‌లకు ఓబీసీ రిజర్వేషన్ 27 శాతం ఇవ్వాలని, ఆ మేరకు అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఎమ్మెల్యేని కోరారు. కార్యక్రమంలో వీరభద్రప్ప, విజయ్, శివలింగప్ప, సురేష్ బాబు, నాగరాజు, రేవప్ప, సోమేష్ పాల్గొన్నారు.

## ఉల్లి రైతు కన్నీరు

### గ్రామాల్లో కురిసిన వర్షం



వెంకటగిరిలో వర్షపునీటిలో తేలియాడుతున్న ఉల్లిని కాపాడుకుంటున్న రైతు

**కోడుమూరు రూరల్, (ఆంధ్రజ్యోతి) అక్టోబరు 21:** మండలంలోని వెంకటగిరి, ప్యాలకుర్తి, కొత్తూరు గ్రామాల్లో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ముఖ్యంగా వెంకటగిరి రైతుల పాలిట వర్షం కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఎనిమిది రోజులుగా ప్రతిరోజూ పడుతున్న వర్షాలతో ఉల్లి పంటకు తీవ్ర నష్టం జరుగుతోందని రైతులు వాపోయారు. గ్రామంలో సుమారు 1500 ఎకరాల్లో ఉల్లి సాగైంది. ఉల్లి పంట ఇప్పుడిప్పుడే కోత దశకు చేరుకుంది. దీంతో పలువురు పొలాల్లో ఉల్లి పీకి ఉంచారు. అయితే కోత చేయడానికి వర్షం అడ్డంకిగా మారుతోంది. నల్లరేగడి కావడంతో పొలాల్లో బురదగా మారింది. దీనికి తోడు వారం రోజులుగా వర్షాలు పడుతుండడం వలన ఉల్లి కుళ్లి నాణ్యత దెబ్బతింటుందని ఆందోళన చెందుతున్నారు. సోమవారం సాయంత్రం భారీ వర్షంతో లోతట్టు పొలాల్లో నీళ్లు నిలిచాయి. వర్షపునీటిలో నానుతున్న ఉల్లిని కాపాడుకోవడానికి రైతన్నలు నానాతంటాలు పడ్డారు. ఇక కోతలు పూర్తైన రైతులు టార్పాలిన్ కవర్లు, బాడుగకు షామియానాలు తెచ్చి ఏర్పాటు చేసుకొని ఉల్లిని సంచుల్లో నింపి విక్రయాలకు సిద్ధం చేస్తున్నారు. తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో కంది పూత రాలిపోవడం జరుగుతోందని, పప్పుశనగ విత్తులు ఆగిపోయాయని వివిధ గ్రామాల రైతులు వాపోయారు.



వెంకటగిరిలో షామియానా వేసుకుని ఉల్లిని సంచులకు నింపుతున్న రైతు

# సమస్యలను వేగంగా పరిష్కరించండి




- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్
- ప్రజల నుంచి వినతుల స్వీకరణ

అర్జీలను స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

**ఆదోని, అక్టోబరు 21, (ఆంధ్రజ్యోతి):** ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించాలని, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.

**వచ్చిన సమస్యలు కొన్ని..**

కౌతాళం మండల సులేకేరి గ్రామానికి చెందిన హనుమంతమ్మ బయో మెట్రిక్ సమస్యతో పింఛన్ అందడంలేదని మంజూరు చేయించాలని కోరారు. బైచిగేరి గ్రామానికి చెందిన ఇందిరా బాయి, ఉమాబాయి, ఉరుకుందమ్మ, చంద్రకళ తమకు 2019లో పట్టాలు ఇచ్చి స్థలాలకు హద్దు చూపలేదని అర్జీ ఇచ్చారు. అలాగే తమ ప్రాంతంలో చిరుతపులి సంచరిస్తోందని కాపాడాలని పెద్దకడూరు మండలం మేకడోన గ్రామం కత్తులకొండ, నరకొండ, జరిమానకొండ, సజ్జలకొండ గ్రామాల ప్రజలు అర్జీ సమర్పించారు. ఆదోని మండలం మండగిరికి చెందిన మల్లికార్జున తన పొలం సర్వే నెంబర్ 131లో 1.32 ఎకరాల భూమి ఆన్‌లైన్‌లో వేరే వారి పేరు నమోదైందని, సమస్య పరిష్కరించాలని కోరారు. సర్వేయర్లు శ్రీనివాసరాజు, వేణు సూర్య డీఎల్‌డీపీవో, నూర్జహాన్, డిఎల్‌డీవో ప్రభాకర్ రెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ పద్మజ, డిప్యూటీ డీఎంహెచ్‌వో సత్యవతి, వలి బాషా పాల్గొన్నారు.

**కబ్జాదారులపై చర్యలు తీసుకోండి**

**ఆదోని టౌన్ :** మండిగిరి పంచాయతీ పరిధిలో స్థలాన్ని కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీఇన్‌చార్జి రమేష్ యాదవ్ డిమాండ్ చేసారు. సోమవారం సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఎమ్మెల్యేకు పర్సనల్ పీఏగా చెప్పుకొంటున్న రవి కిరణ్ అనే ప్రభుత్వ దంత వైద్యుడు మోసానికి పాల్పడ్డారన్నారు. మాజీ ఉపాధ్యక్షుడు దిలీప్ ఢోకా, యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మారుతి, సాయినాథ్, దేవిశెట్టి వీరేష్, శ్రీనిత్, రామకృష్ణ రెడ్డి, వెకంటేష్ పాల్గొన్నారు.

## కబ్జాలకు అవకాశం లేదు

**ఆదోని టౌన్, అక్టోబరు 21, (ఆంధ్రజ్యోతి):** బీజేపీ హయాంలో కబ్జాలకు అవకాశం లేదని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ అన్నారు. రూ.కోట్లు ఖరీదు చేసే స్థలం కబ్జాకు గురైన విషయంపై ఎమ్మెల్యే పార్థసారథి 48 గంటల్లోగా స్పందించి రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయించడాన్ని ప్రజలు హర్షిస్తున్నారని అన్నారు.

## మహిళ మృతి

**ఆదోని, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) :** పట్టణంలోని శ్రీరామ్ నగర్ కాలనీకి చెందిన మహిమదా బేగం (40) విద్యుదా ఘాతంతో మృతి చెందింది. వివరాల మేరకు.. మహిమదా బేగం, నిసార్ అహ్మద్ దంపతులు ఇల్లు నిర్మించుకుంటున్నారు. వాటర్ క్యూరింగ్ చేయడానికి మహిమదా బేగం వెళ్లారు. మెటర్ ఆన్ చేస్తుండగా, విద్యుదాఘాతానికి గురై కిందపడ్డారు. నిసార్ అహ్మద్ ఆమె పడి ఉండడాన్ని గమనించి కేకలు వేశాడు. చుట్టుపక్కల వారు పరిశీలించగా అప్పటికే మృతి చెంది నట్లు గుర్తించారు. టూ టౌన్ సీఐ సూర్య మోహన్ రావ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## పాఠశాలలో విచారణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



బాలికోన్నత పాఠశాలలో విచారణ చేస్తున్న ఎంఈవోలు

**పత్తికొండ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):** విద్యార్థినులతో టీ తెప్పిస్తున్న విషయంపై 'విద్యార్థులా.. పనివాళ్లా' శీర్షికన ఆంధ్రజ్యోతిలో శనివారం ప్రచురితమైన కథనానికి విద్యాధికారులు స్పందించారు. సోమవారం ఎంఈవోలు నరసింహులు, రమేష్ పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో హెచ్ఎం భ్రమరాంబ, ఉపాధ్యాయులను విచారించారు. ఇలాంటి ఘటనలు సరికాదని, పునరావృతమైతే చర్య తప్పవని హెచ్చరించారు.



## వాహనాలతో సరుకులు ఇవ్వాలి

**తుగ్గలి అక్టోబరు 21, (ఆంధ్రజ్యోతి):** అంగన్‌వాడీ కేంద్రాలకు ఎండీయూ వాహనాల ద్వారా సరుకులు ఇవ్వాలని అంగన్‌వాడీ టీచర్లు అరుణజ్యోతి, కాంతమ్మ, రమీజాబీ కోరారు. సోమవారం తహసీల్దార్ నాగరాజుకు వినతి పత్రం అందజేశారు. సరుకుల కోసం డీలర్ల వద్దకు వెళ్లి, అనంతరం ప్రైవేటు వాహనాలలో బాడుగు చెల్లించి తెచ్చుకోవాల్సి వస్తుందన్నారు. తమపై అదనపు బారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించాలని కోరారు.

## సమస్యలను పరిష్కరించండి: ఎమ్మెల్యే కేఈ




వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

**మద్దికెర అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) :** ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఎమ్మెల్యే శ్యాంబాబు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గ్రామాబివృద్ధికి ఎనలేని సేవలందిస్తున్నారని తెలిపారు. వినతుల్లో కొన్ని.. తమ గ్రామంలో తాగునీరు అందడంలేదని, డ్రైనేజీ సరిగా లేదని మదనంతపురానికి చెందిన టీడీపీ నాయకులు శ్రీనివాసులు సంజప్ప, దేవేంద్ర మనవి చేశారు. కాగా కార్యాలయంలో తాగునీరు లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు.

**బీమా సొమ్ముకోసం ప్రదక్షిణలు**

మదనంతపురం గ్రామానికి చెందిన అంకిత తండ్రి పశువుల రామచంద్ర నాలుగేళ్ల క్రితం మరణించాడు. తల్లి, అన్న వలసవెళ్లారు. బీమా పరిహారం అందకపోవడంతో సోమవారం ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇవ్వగా స్పందించిన ఆయన న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. శ్రీనివాసులు, సంజప్ప పాల్గొన్నారు.

## 'తప్పుడు పనులు చేస్తే ఊరుకోను'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి

**ఆదోని, అక్టోబరు 21, (ఆంధ్రజ్యోతి):** తన పేరు చెప్పి తప్పుడు పనులు, కబ్జా చేస్తూ చూస్తూ ఊరుకోనని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. సోమవారం కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే అనుచరుడు స్థలం కబ్జా చేశాడని వచ్చిన వార్తలను ఖండించారు. ఆదోని వారంతా తన కుటుంబ సభ్యులేనని, రూ.కోట్లు విలువైన స్థలాన్ని దంత వైద్యుడు రవి కిరణ్ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించడం తప్పు అన్నారు. పత్రికల ద్వారా తన దృష్టికి రావడంతో ఆ డాక్యుమెంట్‌ను రద్దు చేయించానని తెలిపారు. నకిలీ ఆధార్ కార్డులో పేరును మార్ఫింగ్ చేసి రిజిస్ట్రేషన్ చేయించు కోవడం సరికాదన్నారు. నిందితులపై చట్టం తన పని తాను చేసుకు పోతుందన్నారు. 48 గంటల్లోనే డాక్యుమెంటు రద్దు చేసి బాధితులకు స్థలాన్ని అప్పజెప్పామని అన్నారు. జనసేన ఇన్‌చార్జి మల్లప్ప, టీడీపీ సీనియర్ నాయకుడు దేవేంద్రప్ప, ఉమ్మి సలీం, శ్రీకాంత్ రెడ్డి, గుడిసె కృష్ణమ్మ, ఫక్రుద్దీన్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠం పాల్గొన్నారు.



## బియ్యం వ్యాపారుల దౌర్జన్యం



తాలుకా పోలీస్‌స్టేషన్‌లో ఉన్న బియ్యం ఆటో

- ఆటో డ్రైవర్లపై ఎమ్మెల్యే అనుచరుల పెత్తనం

**ఆదోని రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):** ఎమ్మెల్యే పార్థసారధి అనుచరుల అక్రమాలకు, దౌర్జన్యాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. ఫోర్జరీ సంతకాలతో ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడు ఆదోని నడిబొడ్డున ఎస్కేడి కాలనీలో రూ.2 కోట్లు విలువ చేసే ఆరు సెంట్ల స్థలాన్ని కబ్జా చేసిన కథనం మరవకముందే మరో అనుచరుడు సంతేకుడ్లూరు మధు అక్రమ బియ్యం దందాకు తెర తీశాడు. గత వైసీపీ ప్రభుత్వంలో కొందరు ఆటోడ్రైవర్లు వ్యాపారులు అక్రమంగా సేకరించిన బియ్యాన్ని తరలిస్తుండేవారు. ప్రస్తుతం సిండికేట్‌గా మారడంతో కూలీ ఇవ్వడం లేదని ఆటోడ్రైవర్లు ఎమ్మిగనూరుకెళ్లి వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. అయితే ఆదివారం ఇద్దరు ఆటోడ్రైవర్లు ఆదోనిలో ప్రజల ద్వారా కొనుగోలు చేసిన 20 ప్యాకెట్ల బియ్యాన్ని ఆటోలో వేసుకొని ఎమ్మిగనూరుకు తీసుకెళ్లారు. ఎమ్మిగనూరులో కొనుగోలు చేసిన బియ్యాన్ని మిలటరీ కాలనీలో ఆటోలో వేస్తుండగా, బియ్యం డాన్ సంతేకుడ్లూరు మధు అనుచరులు 15మంది చేరుకొని ఆటో డ్రైవర్లతో ఘర్షణకు దిగారు. ఆదోని బియ్యాన్ని ఎమ్మిగనూరుకు ఎలా తరలిస్తారని ఆదోనికి తరలించారు. వైఎస్ఆర్ టౌన్‌షిప్ వద్ద గొడైన్‌లో 18ప్యాకెట్ల బియ్యాన్ని దించి రెండు ప్యాకెట్లను ఆటోలో ఉంచి తాలుకా పోలీసులకు ఆటోను అప్పగించారు. ఎస్ఐ రామాంజనేయులును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, సిబ్బంది ఆటోను అదుపులో తీసుకున్న మాట వాస్తవమేనన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఐక్యూ ఏఎస్ డైరెక్టర్

## నైపుణ్యముంటే ఉద్యోగాలు

**ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):** నైపుణ్యముంటే ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని జ్యోతిర్మయి విద్యా సంస్థల కరస్పాండెంట్ మురళి బాబు అన్నారు. సోమవారం కళాశాల ఆవరణలో నిర్వహించిన జాబ్‌మేళాలో 30 ఎంఎన్‌సీల ప్రతినిధులు పాల్గొన్నారు. యువతీ, యువకులు జాబ్ మేళాకు తరలి వచ్చారు. అభ్యర్థుల విద్యార్హత ఆధారంగా ఉద్యోగాలు కల్పించినట్లు కరస్పాండెంట్ తెలిపారు. కళాశాల వైస్ ప్రెసిడెంట్ రఘురామయ్య, ప్రిన్సిపాల్ స్వామినాథ్, ఐక్యూఏఎస్ డైరెక్టర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## మద్యం షాప్ పెట్టొద్దు

**ఆలూరు, అక్టోబరు 21, (ఆంధ్రజ్యోతి) :** హాస్టళ్ల వద్ద మద్యం దుకాణం ఏర్పాటు చేయొద్దని కోరుతూ ఎస్ఎఫ్ఐ డీవైఎఫ్ఐ మహిళా సంఘాలు సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశాయి. డీవైఎఫ్ఐ నాయకుడు గోవర్ధన్, షైన, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు ఉమేష్ మహిళా సంఘం మండల అధ్యక్షురాలు శేకన్న బీ మాట్లాడుతూ, అరికేర రహదారిలో బీసీ బాయ్స్ హాస్టల్, బీసీ మేనేజ్‌మె హాస్టళ్లు ఉన్నాయని విద్యార్థులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. తహసీల్దార్ గోవింద్‌సింగ్, ఎక్సైజ్ సీఐ లలితకు వినతిపత్రాలు అందించారు.

## టీడీపీ నాయకుడి చేయూత

**ఆలూరు, అక్టోబరు 21, (ఆంధ్రజ్యోతి):** ఆగ్రహారం ప్రభుత్వ పాఠశాలలో విద్యా వలంటీర్ నియామకానికి టీడీపీ నాయకుడు కొనకొండ్ల నాగరాజు రూ.5వేలు అందజేశారు. పాఠశాలలో 75 మంది విద్యార్థులుండగా, ఒకే ఉపాధ్యాయుడు ఉన్నారని ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ సూచన మేరకు నెలకు రూ.5వేల చొప్పున తాను చెల్లిస్తానని అన్నారు.



## టీనేజీలో జాగ్రత్తగా ఉండాలి : డీఎస్పీ



విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న డీఎస్పీ

**పత్తికొండ టౌన్, అక్టోబరు 21, (ఆంధ్రజ్యోతి):** టీనేజీ వయస్సులో విద్యార్థినులు జాగ్రత్తలు పాటించాలని పత్తికొండ డీఎస్పీ వెంకట్రామయ్య సూచించారు. సోమవారం పభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసు అమరవీరుల దినోత్సవం నిర్వహించారు. పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. హెచ్ఎం భ్రమరాంబ, ట్రైనీ డీఎస్పీ ఉషశ్రీ, సీఐ జయన్న, అరసం జిల్లా కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.





## బీజేపీలో చేరిక

**ఆదోని, అక్టోబరు 21, (ఆంధ్రజ్యోతి) :** పట్టణంలోని 2వ వార్డు వైసీపీ కౌన్సిలర్ ఏవీ సురేష్ వైఎస్సార్ పార్టీని వీడి ఎమ్మెల్యే పార్థసారథి సమక్షంలో బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. కౌన్సిలర్ సురేష్ మాట్లాడుతూ వార్డు సమస్యల పరిష్కారానికి బీజేపీలో చేరానన్నారు. జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ, వెల్లాల మధుసూదన శర్మ, సింహం నాగేంద్ర, జిల్లా కార్యదర్శి ఉపేంద్ర, కో కన్వీనర్ నాగరాజు గౌడ్ ఉన్నారు.

## అమరవీరుల దినోత్సవం

**వెల్దుర్తి, అక్టోబరు, (ఆంధ్రజ్యోతి)21:** పోలీస్ స్టేషన్‌లో సోమవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి, నివాళి అర్పించారు. వెల్దుర్తి ఎస్ఐ అశోక్, క్రిష్ణగిరి సిబ్బంది, హోంగార్డులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం: ఎమ్మెల్యే

**ఎమ్మిగనూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి):** ఎమ్మిగనూరు మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించడమే ప్రజాదర్బార్ లక్ష్యమని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు పట్టణంలోని ఎమ్మిగనూరు మండలానికి సంబంధించి ప్రజాదర్బార్ నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాల నుంచి వచ్చిన గ్రామ ప్రజల నుంచి 300కు పైగా వినతులు ఎమ్మెల్యే బీవీ స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో సీఎం చంద్రబాబు నాయుడు ప్రజా సంక్షేమం, అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారన్నారు. గత ప్రభుత్వం హయాంలో రాష్ట్రంతోపాటు నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతుందన్నారు. మండలంలోని ఆయా గ్రామాల ప్రజల నుంచి భూ సమస్యలు, పెన్షన్లు, తాగు, సాగు నీరు, గృహాలతోపాటు ఇతర సమస్యలను తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. వాటిని ఆయా ప్రభుత్వ శాఖలకు పంపి వాటిని నెలలోపు పరిష్కరిస్తామని చెప్పారు. నెలలో నాలుగు రోజులు ప్రజా దర్బార్ నిర్వహించి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు వాల్మీకి శంకరయ్య, సోమేశ్వరరెడ్డి, మహేంద్ర బాబు, మల్లికార్జున, శంకర్ గౌడ్, కేశన్న, సురేష్ చౌదరి, జగదీష్, నాగరాజు, భీమాలు పాల్గొన్నారు.

**వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి: ఎమ్మెల్యే**

**ఎమ్మిగనూరు టౌన్:** ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే జయనాగేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎమ్మిగనూరు పట్టణంలో శివన్న నగర్‌లోని స్థానిక సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో నవభారత్ వెల్ఫేర్ సొసైటీ, జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్ కర్నూలు వారి సహకారంతో సోమవారం ఉచిత గుండె వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తన తండ్రి గారు మాజీ ఎమ్మెల్యే బి వి మోహన్‌రెడ్డి పేరున ఒక ట్రస్ట్ ఏర్పాటు చేసి ప్రజల ప్రజల రుణాన్ని తీర్చుకుంటానని అన్నారు. డాక్టర్ చెరుకు రాఘవేంద్ర,సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ గణేష్ వైద్య పరీక్ష చేసి, మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు తొగట నరసింహులు, జెట్టప్ప,శివ,రవి,అచారి,కేశవ తదితరులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

## ప్రతి కుటుంబానికి అండగా ఉంటా

### టీడీపీ మంత్రాలయం ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి

**కోసిగి అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):** మంత్రాలయం నియోజకవర్గంలోని ప్రతి కుటుంబానికి అన్నివిధాలుగా అండగా ఉంటామని మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి అన్నారు. సోమవారం మాధవరంలో టీడీపీ కార్యాలయంలో కోసిగికి చెందిన కుమ్మరి కోసిగయ్య, శారదమ్మ దంపతుల కుమారుడు దివ్యాంగుడైన కుమ్మరి మల్లికార్జునకు గత ఐదేళ్ల నుంచి దివ్యాంగుని పింఛన్ రాకపోవడంతో సొంతంగా రూ.12 వేలు నగదు దివ్యాంగుడి కుటుంబానికి అందజేశారు.



మల్లికార్జునకు నగదు ఇస్తున్న రాఘవేంద్రరెడ్డి



## బాలికల హాస్టల్ ఏర్పాటు చేయాలి

**మంత్రాలయం అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి):** మంత్రాలయంలో బాలికలకు ప్రత్యేక హాస్టల్ ఏర్పాటు చేయాలని ఆర్‌పీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఖాజా, కార్యదర్శి కృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా డీఆర్వో చిరంజీవిని కలిసి వినతి పత్రం అందజేశారు. మంత్రాలయంలో బాలికల హాస్టల్ లేకపోవడంతో చాలా మంది చదువును మధ్యలోనే ఆపేస్తున్నారని అన్నారు.



డీఆర్వోకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

## కంది పంటకు మచ్చల పురుగు

**గోనెగండ్ల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి):** ఎమ్మిగనూరు నియోజకవర్గంలో సాగు చేసిన కంది పంటకు మారాకు మచ్చల పురుగు సోకినట్లు ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ తెలిపారు. ఆయన సోమవారం గోనెగండ్ల మండలంలో సాగు చేసిన కంది పంటను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కంది సాగు చేసిన రైతుల సస్యరక్షణ చర్యలు చేపట్టాలని, పురుగు ఉధృతిని బట్టి నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. నియోజకవర్గంలో కంది పంటలో ఈ పురుగు చాలా వరకు సోకిందని అన్నారు. అలాగే నియోజకవర్గంలో పెసర, మినుము, చిక్కుడు, వేరుశనగ జిలుగు వంటి పంటలకు కూడా ఆశించిందన్నారు. నివారణకు వేపనూనె 3మిల్లీలీటర్లకు ఒక లీటర్ నీటిని కలుపుకొని పిచికారి చేసుకోవాలన్నారు. తరువాత పురుగు గమనిస్తే ఏమమేక్టిన్ బెంజోఎట్ 0.3గ్రాములు లేదా నోవాలురాన్ 1మిల్లీ లీటరును ఒక లీటరు నీటిలో కలుపుకొని 2శాతం బెల్లం ద్రావణంలో కలిపి పిచికారి చేసుకుంటే మంచి ఫలితాలు వస్తాయన్నారు.

## పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివి

**గోనెగండ్ల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):** పోలీసు అమరవీరులు త్యాగాలు మరువలేనివని గోనెగండ్ల సీఐ గంగాధర్ అన్నారు. మండల కేంద్ర మైన గోనెగండ్లలో సోమవారం పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం గ్రామంలోని ప్రధాన వీధుల్లో పోలీసులు, ఉన్నత పాఠశాల విద్యార్థులతో ర్యాలీ చేపట్టారు. దేశం కోసం పోలీసుల చేసిన త్యాగాలను ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు.



ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, విద్యార్థులు

## ముగిసిన విద్యా కమిటీ చైర్మన్ ఎన్నిక

**ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని సిరాలదొడ్డి గ్రామంలో కొన్ని నెలలుగా వాయిదా పడుతూ వస్తున్న విద్యాకమిటీ ఎన్నిక చైర్మన్ ఎన్నిక సోమవారం ముగిసింది. ఎంఈవో-2 మధుసూదన్ ఆధ్వర్యంలో ఈ ఎన్నికను నిర్వహించారు. రెండు సార్లు కోరం లేకపోవడంతో వాయిదా పడిన ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. పాఠశాల చైర్మన్‌గా కేశన్న, వైస్ చైర్మన్ చిట్టెమ్మలతోపాటు సభ్యులను విద్యార్థుల తల్లిదండ్రులు ఎన్నుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు పదిమంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

## నేడు చింతలాముని స్వామికి మాస పూజలు

**గోనెగండ్ల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):** గోనెగండ్లలో చింతలాముని, నల్లారెడ్డి స్వాముల వారి మాస పూజలు మంగళవారం జరుగుతున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంగళవారం రాత్రి దేవాలయ ప్రాంగణంలో జిల్లా స్థాయి భజన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ భజన పోటీలలో గెలుపొందిన వారికి మొదటి బహుమతి 30 తులాల వెండిని జిల్లా టీడీపీ కార్యదర్శి ప్రభాకర్‌నాయుడు, రెండోవ బహుమతి 20 తులాలు వెండిని నాగరాజు మిత్ర బృందం, మూడో బహుమతి 15 తులాల వెండి రామకృష్ణ బృందం, అందజేస్తారు. అలాగే నాలుగో బహుమతి పది తులాల వెండి, ఐదో బహుమతి ఎనిమిది తులాల వెండి, ఆరో బహుమతి 5.1/2 తులాల వెండి, ఏడో బహుమతి ఐదు తులాల వెండి, ఎనిమిదో బహుమతి 2.1/2 తులాల వెండి, తొమ్మిదో బహుమతి 2తులాల వెండి, ఇస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనే వారు రూ.500 ప్రవేశ రుసుము చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని ఇతర వివరాలకు 9912050356, 9885637504 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

## 'ఎల్‌ఐసీ ఏజెంట్ల అభివృద్ధికి కృషి'

**ఎమ్మిగనూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి):** ఎల్‌ఐసీ ఏజెంట్ల అభివృద్ధికి భారతీయ లైఫ్ఇన్సూరెన్సు ఏజంట్స్ సంఘ్ సౌత్ సెంట్రల్ జోన్ నాయకులు సత్యనారాయణ రెడ్డి, బీఎంస్ నాయకులు మహాదేవప్ప పేర్కొన్నారు. సోమవారం ఎల్‌ఐజీ కార్యాలయంలో సంఘం సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం నూతన కమిటీ ఎన్నుకున్నారు. ఎమ్మిగనూరు బ్రాంచ్ కన్వీనర్‌గా రామాంజనేయులు, కోశాధికారిగా కృష్ణారెడ్డి, కడప డివిజన్ కన్వీనర్‌గా నరసింహులు, కర్నూలు జిల్లా కన్వీనర్‌గా జీ వెంకటేశ్వరరెడ్డి, సౌత్ సెంట్రల్ జోన్ కన్వీనర్‌గా రంగస్వామిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం బీఎంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కేఎస్ఎన్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, జగదీష్, వెంకటయ్య, బండాకిరణ్, ఉరుకుందు, వీవీ మద్దిలేటిలు పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధికి కృషి: టీడీపీ

**నందవరం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి):** నందవరంలో పెద్దమ్మ ఆలయంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ దేశాయి మాదవరావు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధి కోసం తన వంతు రూ. 90 వేలు ఇచ్చారు. ఆలయ నిర్వాహకులు దేశాయిని సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తెలుగు ఈరన్న, వెంకటేశ్వర్లుచ మల్లి, శ్రీనివాసులు, పాలక సభ్యులు పాల్గొన్నారు.

## 'పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి'

**ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):** పారిశుధ్య కార్మికుల వేతనాలు విడుదల చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. మండల విద్యాశాఖ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న పాఠశాల పారిశుధ్య కార్మికులు ధర్నా నిర్వహించారు. నాలుగు నెలల నుంచి వేతనాలు లేకపోవడంతో పస్తులు ఉండాల్సి వస్తుందని సీఐటీయూ తాలుకా కార్యదర్శి రాముడు ఆరోపించారు. వెంటనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంఈవో ఆంజనేయులుకు వినతి పత్రం అందజేశారు. కవిత, పద్మావతి, జయశ్రీ పాల్గొన్నారు.

## రైతులకు న్యాయం చేయాలి

**మంత్రాలయం అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి):** మాధవరం, కల్లుదేవకుంట, కోసిగి, కౌతాళం, పెద్దకడుబూరు, మంత్రాలయం మండలాల్లో ఆర్వోఆర్ కేసులను పరిష్కరించి అర్హులైన రైతులకు న్యాయం చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి భాస్కర్ యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం సబ్ కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాధవరంలో సర్వే నెం.148-ఏలో 18.20 ఎకరాల భూమి ఆక్రమణకు గురైందని అర్హులైన సులేమాన్, రజాక్, సుక్రుసాబ్ సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారని తెలిపారు.

## పేకాటరాయుళ్ల అరెస్టు

**పెద్దకడుబూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) :** మండలంలోని హనుమాపురం సమీపంలోని జగనన్న కాలనీ వద్ద పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ నిరంజన్‌రెడ్డి సోమవారం తెలిపారు. వారి నుంచి రూ. 33,600 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి

**ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):** ఎమ్మిగనూరు పట్టణంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, మరమ్మతులు చేపట్టాలని భారత ప్రగతిశీల యువజన సంఘం జిల్లా కార్యదర్శి చిన్ని ప్రసాద్, శివ అధికారులను కోరారు. సోమవారం కర్నూలు ఆడిటోరియంలో కలెక్టర్ రంజిత్ బాషాకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఎమ్మిగనూరు నుంచి కోసిగికి వెళ్లే దారి పొడవునా మోకాళ్ల లోతు గుంతలు పడ్డాయన్నారు. చిన్నపాటి వర్షానికే గుంతల్లో వర్షపునీరు చేరి ప్రమాదాలు జరుగుతున్నాయని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు.

## ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం

**ఎమ్మిగనూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి):** ఉపాధ్యాయ సమస్యలపై యూటీఎఫ్ పోరాటం చేస్తోందని యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్ కుమార్ అన్నారు. సోమవారం యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభల సందర్భంగా పట్టణంలోని వీవర్స్ కాలనీలో జడ్పీ ఉన్నత పాఠశాలలో మహాసభను నిర్వహించారు. యూటీఎఫ్ జెండాను నాయకులు ఎగురవేశారు. నాయకులు మాట్లాడుతూ యూటీఎఫ్ స్థాపించి 50ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా స్వర్ణోత్సవాలు జరుపుకుంటున్నామన్నారు. సభలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు విక్టోరియమ్మ, విజయకుమారిలను ఘనంగా సన్మానించారు. నాయకులు దావీదు, దేవపాల్, నరసింహులు, కౌలన్న, రామాంజనేయులు, రాఘవేంద్ర, నాగరాజు పాల్గొన్నారు.

## మహాసభలను జయప్రదం చేయండి

**కోసిగి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి):** ఆదోని పట్టణంలో నవంబరు 12, 13 తేదీల్లో జరిగే ఏఐఎస్ఎఫ్ 30వ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.వీరేష్ అన్నారు. సోమవారం కోసిగిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్షులు విజయ్, మహిళా కన్వీనర్ వరలక్ష్మి, రాజేశ్వరి, మేఘన, అరుణమ్మ, అంజలి, శిల్ప, మహాదేవి పాల్గొన్నారు.

## ఉపాధి పనులు కల్పిస్తాం

**కోసిగి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):** కూలీలందరికీ ఉపాధి పనులు కల్పిస్తామని, ఎవరూ కూడా వలస వెళ్లొద్దని ఏపీడీ లోకేశ్వర అన్నారు. సోమవారం ఆంధ్రజ్యోతి దినపత్రిలో వలస కోసిగి.. అనే కథనానికి స్పందించి సోమవారం 3వ, 4వ వార్డులలో కూలీలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏపీడీ లోకేశ్వర మాట్లాడుతూ ఎవరూ కూడా వలస వెళ్లవద్దని, స్థానికంగా అందరికీ ఉపాధి పనులు కల్పిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. ఏపీవో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి అథ్లెటిక్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

**పెద్దకడుబూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి):** స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫేడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన స్కూల్ గేమ్స్‌లో మండలంలోని కల్లుకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికైయ్యారు. ఎంపికైనా విద్యార్థులను హెచ్ఎం ఉసేనప్ప, పీఈటీ దుబ్బన్నలు వారిని అభినందించారు. ఖోఖో పోటీల్లో అండర్-14 విభాగం నుంచి హరికృష్ణ, అండర్-16 నుంచి ఎండీ ఉదయ్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

## కలుగొట్ల రోడ్డుకు మరమ్మతులు

**ఎమ్మిగనూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని కలుగొట్ల రోడ్డుకు మరమ్మతులు మున్సిపల్ అధికారులు చేపట్టారు. సోమవారం రోడ్డు మరమ్మతు పనులను ప్రారంభించారు. గత కొంత కాలం నుంచి రోడ్డు మరమ్మతుకు నోచుకోలేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్డుపనులు త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ అధికారులను ప్రజలు కోరుతున్నారు. ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి కృషితోనే రోడ్డు పనులు అధికారులు చేపట్టారని టీడీపీ నాయకులు శాలేము, అంబేడ్కర్, నూరిలు పేర్కొన్నారు.